www.vishalabharati.com
epaper:vishalabharati.com

బుధవారం, హైదరాబాద్
26.06.2024
సంపుటి:2 సంచిక:252

# విశాల భారతి
తెలుగు దిన పత్రిక

## జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్
# రద్దు చేయండి
### హైకోర్టును ఆశ్రయించిన కేసీఆర్

- కమిషన్ ఏర్పాటు సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం
- హైకోర్టులో కేసీఆర్ రిట్ పిటిషన్
- విద్యుత్ కొనుగోళ్లలో అక్రమాలపై రేవంత్ సర్కార్ కమిషన్



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
తెలంగాణ విద్యుత్ కమిషన్ పై హైకోర్టును ఆశ్రయించారు మాజీ సీఎం కేసీఆర్. జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ ను రద్దు చేయాలని రిట్ పిటిషన్ దాఖలు చేశారు. కమిషన్ ఏర్పాటు సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా ఉందని ..నిబంధనల మేరకే విద్యుత్ కొనుగోలు జరిగిందని కేసీఆర్ తెలిపారు. జస్టిస్ నర్సింహారెడ్డి ప్రెస్ మీట్లు పెట్టి మరీ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రిట్ పిటిషన్‌లో ప్రతివాదులుగా విద్యుత్ కమిషన్, జస్టిస్ నర్సింహారెడ్డి,

..మిగతా 2 లో



# చరిత్రలో తొలిసారి.. లోక్ సభ స్పీకర్ ఎన్నిక

- ఏకగ్రీవానికి సహకరించాలన్న ఎన్డీయే
- తమకు డిప్యూటీ స్పీకర్ ఇస్తే తప్పుకుంటామన్న కాంగ్రెస్
- ఒప్పుకోని బీజేపీ.. చివరకు ఎన్నిక!
- మొత్తం సభ్యులు 543 మంది
- ఎన్డీయేకు 293, ఇండియా కూటమికి 234
- విప్ జారీ చేసిన కాంగ్రెస్

> లోక్‌సభ స్పీకర్‌గా మళ్లీ ఓం బిర్లాకే అవకాశం కల్పించాలని ఎన్డీయే కూటమి నిర్ణయించింది. అయితే, ఈ విషయంలో అధికార, విపక్షాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో చరిత్రలో తొలిసారి స్పీకర్ పదవికి ఎన్నిక అనివార్యమైంది. ఎన్డీఏ తరఫున ఓం బిర్లా నామినేషన్ దాఖలు చేయనుండగా.. విపక్ష ఇండియా కూటమి తరఫున కాంగ్రెస్ ఎంపీ కే సురేశ్ నామినేషన్‌కు సిద్ధమయ్యారు. స్పీకర్ పదవికి జూన్ 25తో నామినేషన్ గడువు ముగియనుంది.. ఈ మధ్యాహ్నం 12 గంటల్లో నామినేషన్ వేయాలని లోక్‌సభ సెక్రటేరియట్ నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం 543 మంది సభ్యులున్న లోక్‌సభలో ఎన్డీఏకు 293, ప్రతిపక్ష ఇండియా కూటమికి 234 మంది ఎంపీలు ఉన్నారు. కొంతమంది స్వతంత్ర ఎంపీలు కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించారు. కానీ ఎన్డీయే కూటమికి సభలో స్పష్టమైన మెజారిటీ ఉంది. అయితే, ఓం బిర్లాను స్పీకర్‌గా కొనసాగిస్తే.. డిప్యూటీ స్పీకర్ పదవిని తమకు ఇవ్వాలని విపక్షాలు చేసిన ప్రతిపాదనను ఎన్డీయే కూటమి తిరస్కరించింది. దీంతో స్పీకర్ పదవికి అభ్యర్థిని నిలపాలని ఇండియా కూటమి నిర్ణయించింది. డిప్యూటీ స్పీకర్ పదవి తమకు ఇవ్వాలని రాహుల్ గాంధీ కూడా కోరారు. అందుకు అధికార పక్షం నుంచి ఎటువంటి స్పందన రాలేదు.

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
ఇప్పటి వరకూ దేశ పార్లమెంట్ చరిత్రలోనే స్పీకర్ ఎన్నిక జరిగిన దాఖలాలు లేవు. ఏకగ్రీవంగానే స్పీకర్‌ను ఎన్నుకునేవారు స్పీకర్ పదవి అధికార పార్టీకి.. డిప్యూటీ స్పీకర్ విపక్షానికి దక్కేది. కానీ, ఈసారి మాత్రం ఎన్నిక అనివార్యమైంది. స్పీకర్ పదవికి జూన్ 26న ఎన్నికలు జరగనున్నాయి. తాము ఓం బిర్లాకు మద్దతు ఇస్తాం కానీ.. డిప్యూటీ స్పీకర్ పదవి తమకు ఇవ్వాలని ఇండియా కూటమి ప్రతిపాదన చేసింది. నామినేషన్‌కు గడువు ముగిసే సమయం దగ్గర పడుతున్నా అధికార పక్షం ఎటువంటి హామీ రాకపోవడంతో ఇండియా కూటమి స్పీకర్ పదవికి పోటీచేయాలని నిర్ణయించింది. సరిగ్గా గడువుకు 10 నిమిషాల ముందే సీనియర్ ఎంపీ కేఆర్ సురేశ్ నామినేషన్ దాఖలు చేశారు.డిప్యూటీ స్పీకర్ పదవిపై తర్వాత నిర్ణయం తీసుకుంటామని బీజేపీ సూచించిందని, ముందు ఓం బిర్లాకు

..మిగతా 2 లో



## సీఎం సోదరుడి చెక్కుల పంపిణీ

- కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేసిన తిరుపతిరెడ్డి
- ఏ హోదాతో పంచారంటూ ఆగ్రహం
- ముఖ్యమంత్రి సోదరుడైతే చెక్కులు పంచొచ్చా?
- ఇవి కావా కుటుంబరాజకీయాలు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
సాధారణంగా ప్రభుత్వ పథకాల పంపిణీలో ప్రజాప్రతినిధులు, ఉన్నత స్థాయి అధికారులే పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తారు. అలాగే చేయాలి. కానీ ఎలాంటి పదవి లేకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు అన్న అర్హతతో ప్రభుత్వంలో ఎలాంటి పదవి లేకపోయినా, అధికారి కాకపోయినా తిరుపతి రెడ్డి కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. తిరుపతి రెడ్డి మంగళవారం తమ నియోజకవర్గంలో కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేయడంతో దౌల్తాబాద్ జడ్పీటీసీ కోట్ల మహిపాల్ ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి పదివి లేకున్నా కేవలం ముఖ్యమంత్రి అన్న అనే కారణంతో కల్యాణ లక్ష్మి చెక్కులు ఎలా పంపిణీ చేస్తారంటూ ఆయనను నిలదీశారు. ప్రోటోకాల్ ఒకటి ఉంటుందని దాని ప్రకారమే చెక్కులను పంపిణీ చేయాలని కోరారు.

**కేసీఆర్ ఇచ్చిన చెక్కులే అవి**
తాము ఉన్నన్ని రోజులు ప్రోటోకాల్ పాటించాలని ఆయనను కోరారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వచ్చిన చెక్కులనే ఇప్పుడు ఇస్తున్నారని, కానీ కాంగ్రెస్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన

..మిగతా 2 లో



## లోక్ సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్

- ఇండియా కూటమి సమావేశంలో ఎన్నిక
- ప్రొటెం స్పీకర్ కు సోనియా గాంధీ లేఖ
- పదేండ్ల తర్వాత తొలిసారి ప్రతిపక్ష నేత

..మిగతా 2 లో




### త్వరలో పట్టాల మీదకు
# వందేభారత్ స్లీపర్ రైలు

- వడివడిగా రైల్వేశాఖ అడుగులు
- ఆగస్ట్ 15 నాటికి అందుబాటులోకి వచ్చే చాన్స్
- ఇప్పటికే పనులను పరిశీలించిన రైల్వే శాఖ మంత్రి

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
దేశంలో మొట్టమొదటిసారిగా వందే భారత్ స్లీపర్ రైలు త్వరలో పట్టాలెక్కనుంది. స్లీపర్ రైలును అందుబాటులోకి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లుగా అధికారిక వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం వందే భారత్ రైళ్లు ఛైర్‌కార్ సర్వీసులను మాత్రమే అందిస్తున్నాయి. ఈనేపథ్యంలో

..మిగతా 2 లో



## తెలుగులో ప్రమాణం చేసిన తమిళ ఎంపీ

- కృష్ణగిరి నుంచి గెలుపొందిన కే గోపీనాథ్
- గోపినాథ్ మాతృభాష తెలుగే.

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**మన దేశంలో ఎన్నో భాషలు ఉన్నాయి. దేశంలో ఎక్కువమంది మాట్లాడే భాష హిందీ అయినప్పటికీ.. ప్రాంతీయంగా ఉన్న భాషల పట్ల స్థానికులకు ఎంతో ప్రేమ ఉంటుంది. ఇక దక్షిణాదిన తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషలు ఉన్నాయి. ఇందులో దేశం మొత్తంలో తమిళులకు తమ భాష అంటే మక్కువ ఎక్కువ అని అందరూ అంటుంటారు. తమ భాష మీద ఉన్న అమితమైన ప్రేమతో ఒకప్పుడు హిందీ, ఇంగ్లీష్ వంటి భాషలను నేర్చుకోవడానికి కూడా తమిళనాడు ప్రజలు ఇష్టపడలేదంటే వారికి తమ భాషపై ఉన్న ఇష్టం ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. అలాంటిది.. తమిళనాడుకు చెందిన

..మిగతా 2 లో




# డ్రగ్స్ రహిత తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం

- అక్రమార్కుల గుండెల్లో రైల్లు పరుగెత్తించేలా నిర్ణయాలు
- ఎంతటి పెద్దవారు ఉన్న ఉపేక్షించేది లేదు
- పన్నుల నుంచి వస్తున్న ప్రతి పైసను సద్వినియోగం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
డ్రగ్స్ రహిత తెలంగాణ సమాజమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మాదక ద్రవ్యాల రవాణాలో ఎంతటి పెద్దవారు ఉన్న ఉపేక్షించబోమని, ఉక్కు పాదంతో తమ ప్రభుత్వం అణచివేస్తుందన్నారు. డ్రగ్స్ రవాణా చేసే అక్రమార్కుల గుండెల్లో రైల్లు పరుగేత్తించేలా తమ ప్రభుత్వం నిర్ణయాలు ఉండబోతాయన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మంగళవారం హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క యాంటీ డ్రగ్ అవేర్నెస్ సాంగ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణలో ఏర్పడిన ఇందిరమ్మ రాజ్యంలో మాదక ద్రవ్యాలు, అక్రమ రవాణా అనే మాట వినబడటానికి వీలులేదని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కఠిన నిర్ణయం

..మిగతా 3 లో

## రైతు భరోసా ఏడాదికి రూ.15 వేలు

- గత ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేలే ఇచ్చింది
- ప్రజాధనం వృథా కాకుండా ఉండేందుకు పటిష్ఠ విధానాలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

..మిగతా 2 లో

# అసద్ ప్రమాణం.. తీవ్ర దుమారం

- జై పాలస్తీనా.. అల్లాహ్ అక్బర్ అనడంతో వివాదాస్పదం
- బీజేపీ ఎంపీల తీవ్ర అభ్యంతరం
- రికార్డ్స్ నుంచి తొలగిస్తామని ప్రకటించిన స్పీకర్
- తెలంగాణ ఎంపీల ప్రమాణ స్వీకారం



**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**
పార్లమెంట్ లో మంగళవారం ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. జూన్ 24న సోమవారం నాడు కొందరు ఎంపీలు లోక్‌సభలో ప్రమాణం చేశారు. నేడు సైతం ఎంపీల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతోంది. ఈ క్రమంలో ఏఐఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రమాణ స్వీకారం దుమారం రేపింది. అసదుద్దీన్ ఒవైసీ హైదరాబాద్ ఎంపీగా

..మిగతా 3 లో



# రైతు భరోసా ఏడాదికి రూ.15 వేలు

- గత ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేలే ఇచ్చింది
- ప్రజాధనం వృథా కాకుండా ఉండేందుకు పటిష్ఠ విధానాలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలో రైతుబంధు స్థానంలో ప్రభుత్వం రైతు భరోసా పథకం తీసుకొస్తున్న దృష్ట్యా పెట్టుబడి సాయం కూడా సంవత్సరానికి ఎకరాకు రూ.15,000 చొప్పున అందజేయనున్నామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేలు ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అదనంగా మరో రూ.5 వేలు పెంచి అందజేయబోతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 110 గ్రామీణ నియోజకవర్గాల్లో ఉన్న రైతు వేదికల్లో నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేసిన వర్చువల్గా సచివాలయం నుంచి మంత్రి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రణాళిక సంఘం ఉప ఛైర్మన్ చిన్నారెడ్డి, అఖిల భారత కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, రైతు నాయకులు, ఉన్నతాధికారులు, రైతులు పాల్గొన్నారు.

ప్రతి మంగళవారం నిర్వహించే రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా రైతు భరోసా పథకం అమలుపై రైతులు నుంచి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభిప్రాయాలు సేకరించారు. చాలా మంది రైతులు ఈ పథకం సాగు చేసే వారికి, అదే విధంగా సాగులో ఉన్న భూమికే పెట్టుబడి సహాయం అందించాలని సూచించారు. అంతేకాకుండా గరిష్ఠ పరిమితి విధించి రైతుభరోసా పథకం వర్తింపచేయాలని కోరారు. అనంతరం రైతు నేస్తం కార్యక్రమంలో వెల్లడించిన, రాత పూర్వకంగా సేకరించిన సూచనలన్నింటినీ క్రోడీకరించి ఒక నివేదిక తయారు చేయాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపీని మంత్రి తుమ్మల ఆదేశించారు.

అయితే రైతుబంధు తరహాలో ప్రజాధనం వృథా కాకుండా ఉండేందుకు పటిష్ఠ విధానాలు రూపొందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తుమ్మల చెప్పారు. గతంలో సాగులోలేని భూములకు కూడా రైతుబంధు వర్తింపచేసి 12 విడతల్లో దాదాపు రూ.25,670 కోట్ల ప్రజాధనం వృథా చేశారని ప్రస్తావించారు. ఇంకా ప్రభుత్వం రైతుభరోసాకు సంబంధించి ఎటువంటి నిర్ణయాలు తీసుకోలేదన్నారు. పూర్తిగా అందరి అభిప్రాయాలు, శాసనసభలో సభ్యులతో చర్చించిన తర్వాతనే పథకం తీసుకొస్తామని స్పష్టం చేశారు. రైతన్నల ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని కాస్త ఆలస్యమైన కూడా అర్హులకు మాత్రమే అందే విధంగా రైతు భరోసా పథకం రూపకల్పన చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

# తడిగుడ్డతో కౌశిక్ ప్రమాణం

- ఇంట్రెస్టింగ్ గా తెలంగాణ పాలిటిక్స్
- జోరుగా సవాళ్ల పర్వం
- రాష్ట్రంలో తడిగుడ్డల ట్రెండ్
- బండి సంజయ్, రేవంత్ వంతు అయిపోయింది.. ఇప్పుడు కౌశిక్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**
తెలంగాణ రాజకీయాలు రోజురోజుకు ఆసక్తికరంగా మారింది. అధికార, ప్రతిపక్ష పార్టీల నేతల మధ్య ఘాటు విమర్శలతో పాటు సంచలన ఆరోపణలు కూడా నడుస్తున్నాయి. ఈ క్రమంలోనే.. జోరుగా సవాళ్ల పర్వం నడుస్తోంది. అయితే.. రాజకీయ నేతలన్నాక ఒకరిపై ఒకరు సవాళ్లు విసురుకోవటం సర్వసాధారణమే. ఆ సవాళ్లు స్వీకరించేది లేదు.. నిరూపణ అయ్యేది లేదు అని కొట్టిపాడేయకండి. ప్రస్తుతం.. తెలంగాణ రాజకీయాల్లో కొత్త ట్రెండ్ మొదలైంది. ప్రత్యర్థులపై సవాళ్లు చేయటమే కాదు.. వాటిని స్వీకరిస్తున్నారు కూడా. అందులోనూ.. దేవుళ్ల సాక్షిగా ప్రమాణాలు చేసి నిజాయితీ నిరూపించుకోవాలన్న సవాళ్లు ఎక్కువగా వినిపిస్తుండగా.. వాటిని స్వీకరిస్తున్న నేతలు తడిబట్టలతో దైవం సాక్షిగా ప్రమాణాలు చేయటం ఇప్పుడు ట్రెండ్గా మారింది. ఈ లిస్టులో ఇప్పటికే... బండి సంజయ్, రేవంత్ రెడ్డి ఉండగా.. ఇప్పుడు పాడి కౌశిక్ రెడ్డి కూడా చేరారు.

రామగుండం ఎన్టీపీసీ ఫ్లైయాష్ వ్యవహారం ఇప్పుడు తెలంగాణలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఫ్లైయాష్ అక్రమ రవాణాతో మంత్రి పొన్నం ప్రభాకర్ రూ. వంద కోట్లు దండుకున్నారంటూ పాడి కౌశిక్ రెడ్డి ఆరోపించారు. ఈ ఆరోపణలపై స్పందించిన పొన్నం.. తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటూ పాడి కౌశిక్ రెడ్డికి లీగల్ నోటీసులు పంపించారు. ఈ నోటీసులను కోర్టులోనే ఎదుర్కొంటానని చెప్పిన కౌశిక్ రెడ్డి.. తనకు ఫ్లైయాష్ అక్రమ రవాణాతో సంబంధం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ దేవుడి సాక్షిగా ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు.


ఈ సవాల్ మీద స్పందించిన హుజూరాబాద్ కాంగ్రెస్ ఇంఛార్జి వొడితెల ప్రణవ్ స్పందించారు. మంత్రి ప్రమాణం చేయడం కాదు.. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డే హుజూరాబాద్ మండలంలోని చెల్పూర్ హన్మంతుడి ఆలయం వద్దకు వచ్చి.. తాను అవినీతి చేయలేదని ప్రమాణం చేయాలని ప్రతిసవాల్ విసిరారు. ఆ సవాల్ను స్వీకరించిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మంగళవారం ఉదయం చెల్పూర్ హన్మంతుడి ఆలయానికి బయల్దేరగా.. పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. అటు కాంగ్రెస్ నేత ప్రణవ్ను కూడా సింగాపురంలో నిర్బంధించారు.

**తడిబట్టలతో పాడి కౌశిక్ రెడ్డి ప్రమాణం..**
పోలీసులు తనను బయటకు రానివ్వకపోవడంతోనే ఇంట్లోని హన్మంతుడి ఫొటో ఎదుట.. తడి బట్టలతో కౌశిక్ రెడ్డి ప్రమాణం చేశారు. తాను ఎలాంటి అవినీతికి పాల్పడలేదంటూ హన్మంతుడి సాక్షిగా ప్రమాణం



చేశారు. ఈ క్రమంలోనే.. మంత్రి పొన్నం ప్రభాకర్ తన నిజాయితీ నిరూపించుకునేందుకు హైదరాబాద్ జూబ్లీహిల్స్లోని వెంకటేశ్వర ఆలయం వద్దకు వచ్చి ప్రమాణం చేయాలని.. కౌశిక్ రెడ్డి సవాల్ విసిరారు.

# లోక్ సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్



**మొదటిపేజీ తరువాయి**

ఓ ఎంపీ లోక్సభలో తెలుగులో ప్రమాణం చేయడం ఇప్పుడు దేశం మొత్తాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తింది. తమిళనాడులోని కృష్ణగిరి లోక్సభ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచిన కె.గోపీనాథ్.. మంగళవారం పార్లమెంట్లో ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. ఒక చేతితో రాజ్యాంగం పుస్తకాన్ని పట్టుకుని స్పీకర్ పోడియం వద్దకు వెళ్లిన కె.గోపీనాథ్.. సభకు నమస్కారం అంటూ తెలుగులో ప్రమాణ స్వీకారం మొదలుపెట్టారు. ప్రమాణ స్వీకారం మొత్తం తెలుగులోనే చేసిన ఆయన.. ఆఖర్లో నండ్రి, వణక్కం, జై తమిళనాడు అంటూ తమిళంతో ముగించారు. అయితే కె. గోపీనాథ్ తమిళంలో కాకుండా తెలుగులో ప్రమాణ స్వీకారం చేయడానికి ఒక ప్రత్యేకమైన కారణం ఉంది. ఆయన మాతృభాష తెలుగు కాగా.. తమిళనాడులో స్థిరపడ్డారు.

గతంలో మూడుసార్లు హోసూర్ నుంచి కె.గోపీనాథ్ ఎమ్మెల్యేగా గెలిచారు. 2001, 2006, 2011లో వరుసగా గెలిచిన గోపీనాథ్.. 2016లో మాత్రం అన్నాడీఎంకే అభ్యర్థి పి.బాలకృష్ణారెడ్డి చేతిలో ఓడిపోయారు. దీంతో ఈసారి కృష్ణగిరి లోక్సభ స్థానం నుంచి ఆయనను కాంగ్రెస్ పార్టీ బరిలోకి దింపింది. తొలిసారి ఎంపీగా పోటీచేసిన గోపీనాథ్ ఇండియా కూటమి తరఫున గెలుపొందారు. తమిళనాడులో కృష్ణగిరి, హోసూర్.. ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో ఉంటాయి. ఈ రెండు నియోజకవర్గాల్లో తెలుగు ప్రజలు చాలా ఎక్కువ మంది ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సొంత నియోజకవర్గం అయిన కుప్పం నుంచి కృష్ణగిరి సుమారు 35 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక హోసూర్.. సుమారు 90 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇండస్ట్రియల్ హబ్ అయిన హోసూర్లో చాలా ఏళ్ల కిందటే తెలుగు ప్రజలు స్థిరపడ్డారు. సుమారు 50 శాతం మంది తెలుగువారు హోసూర్లో స్థిరపడినట్టు అంచనా. హోసూర్లో ఉన్న వ్యాపారవేత్తల్లోనూ తెలుగువారే ఎక్కువ. ఇప్పుడు కృష్ణగిరి నుంచి ఎంపీగా గెలిచిన గోపీనాథ్ కూడా హోసూర్లో వ్యాపారవేత్త. ఈయన పూర్వీకులు ఏపీ నుంచి హోసూర్ వెళ్లి వ్యాపారాలు చేశారు. అక్కడే స్థిరపడ్డారు. గోపీనాథ్ హోసూర్లోనే పుట్టారు. అయినప్పటికీ మాతృభాష మీద మమకారంతో తెలుగులో ప్రమాణం చేశారు.



# చరిత్రలో తొలిసారి.. లోక్ సభ స్పీకర్ ఎన్నిక

**మొదటిపేజీ తరువాయి**

మద్దతు ఇవ్వాలని విపక్షాలకు పిలుపునిచ్చిందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వం, దేశాన్ని నడపడానికి ఏకాభిప్రాయం అవసరమని ప్రధాని నరేంద్ర మోదీ నొక్కిచెప్పిన 24 గంటలైనా కాకముందే బీజేపీ నేతృత్వంలోని సంకీర్ణ సర్కారు, ప్రతిపక్షాల మధ్య ప్రతిష్టంభన ఏర్పడింది. దీనిపై రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. డిప్యూటీ సభాపతి పదవిని విపక్షానికి ఇచ్చే సంప్రదాయం కొనసాగుతోందని, ఈసారి కూడా ఇదే ప్రతిపాదన చేశామన్నారు. కానీ, బీజేపీ మాత్రం మా ప్రతిపాదనకు అంగీకరించలేదని పేర్కొన్నారు. సోమవారం కేంద్ర మంత్రి రాజ్నాథ్ సింగ్తో జరిగిన సమావేశంలో ఖర్గేతో చర్చిస్తామని చెప్పారని, కానీ ఇంత వరకూ ఎటువంటి సమాచారం లేదన్నారు. అధికారపక్షం తీరు ఇండియా కూటమిని అవమానించేలా ఉందని రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు.

# జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ రద్దు చేయండి



**మొదటిపేజీ తరువాయి**

ఎనర్జీ విభాగాన్ని చేర్చారు.

**పదేళ్లలో విద్యుత్ అక్రమాలపై కమిషన్ వేసిన రేవంత్ సర్కార్**
తెలంగాణలో బీఆర్ఎస్ హయాంలో జరిగిన విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు, కొత్త థర్మల్ విద్యుత్తు కేంద్రాల నిర్మాణంపై విచారణ జరిపేందుకు గత మార్చి 14న రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఏకసభ్య విచారణ కమిషన్ను ఏర్పాటు చేసింది. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ యాక్ట్ 1952 కింద ఏర్పాటైన ఈ కమిషన్ ఇప్పటికే విచారణను ప్రారంభించి, తెలంగాణ విద్యుత్తు సంస్థలకు చెందిన దాదాపు 25 మంది అధికారులను, మాజీ అధికారులను విచారించింది. దీంతో పాటు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ను కూడా ఈ నెల 15వ తేదీలోపు వివరణ ఇవ్వాలని కోరుతూ నోటీసులు జారీ చేసింది. కేసీఆర్ 12 పేజీల సుదీర్ఘ లేఖను ఈ నెల 15వ తేదీన కమిషన్కు పంపించారు.

**జస్టిస్ నరసింహారెడ్డిని వైదొలగాలని డిమాండ్ చేసిన కేసీఆర్**
తెలంగాణలో విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు, కొత్త థర్మల్ పవర్ ప్లాంట్ల నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం వేసిన విచారణ కమిషన్ చెల్లదని కేసీఆర్ అంటున్నారు. ఎంక్వైరీ కమిషన్ బాధ్యతలు స్వీకరించిన హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నర్సింహారెడ్డికి ఈ అంశాలపై విచారణ జరిపే అర్హత లేదని వాదిస్తున్నారు. విచారణ కమిషన్ బాధ్యతల నుంచి వెంటనే స్వచ్ఛందంగా వైదొలగాలని జస్టిస్ నర్సింహారెడ్డిని కేసీఆర్ డిమాండ్ చేశారు. కమిషన్ విషయంలో ప్రభుత్వం పేర్కొన్న అంశాలకు, జస్టిస్ నర్సింహారెడ్డి విలేకరుల సమావేశంలో చేసిన వ్యాఖ్యలకు లేఖలో కేసీఆర్ సమాధానమిచ్చారు.

**కమిషన్ చట్ట విరుద్ధమని వాదన**
న్యాయ ప్రాధికార సంస్థలైన ఈఆర్సీలు వెలువరించిన తీర్పులపై ఎంక్వైరీ కమిషన్ ఏర్పాటు చట్ట విరుద్ధమని, హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించిన మీరు ప్రభుత్వానికి సూచించకుండా, విచారణ కమిషన్ బాధ్యతలు స్వీకరించడం విచారకరమని కేసీఆర్ అంటున్నారు. చివరికి న్యాయ ప్రాధికార సంస్థలైన ఈఆర్సీల అధికార పరిధి గురించి చట్టంలో ఏముందో కూడా గమనించకుండా మీరు మాట్లాడారని అంటున్నారు. లేఖలో పేర్కొన్న అంశాలతోనే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. త్వరలో ఈ పిటిషన్ విచారణకు వచ్చే అవకాశం ఉంది.



# సీఎం సోదరుడి చెక్కుల పంపిణీ

**మొదటిపేజీ తరువాయి**

తులం బంగారం ఇవ్వడం లేదంటూ మహిపాల్ తీవ్రంగా మండిపడ్డారు. దీంతో పక్కనే ఉన్నవాళ్లు జడ్పీటీసీ మహిపాల్ను బుజ్జగిస్తూ మీరు పంచండి అని చెప్పే ప్రయత్నం చేశారు. కానీ తిరుపతి రెడ్డి నువ్వేం చేయాలనుకుంటున్నావో నాకు తెలుసు.. ఇక్కడ న్యూసెన్స్ చేయకు అంటూ హెచ్చరించారు. అనంతరం తిరుపతి రెడ్డినే మిగితా చెక్కులను సైతం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. దీంతో సీఎం రేవంత్ రెడ్డి సోదరుడి తీరుపై నియోజకవర్గంలో చర్చ జరుగుతోంది. ఎలాంటి పదవి లేకున్నా చెక్కుల పంపిణీలో తిరుపతి రెడ్డి పెత్తనం ఏంటని జనాలు ప్రశ్నిస్తున్నారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట్లో వైరల్ అవ్వడంతో నెటిజన్లు తీవ్రంగా ఫైర్ అవుతున్నారు. సీఎం కుటుంబం రాజకీయాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ఆయనే అంతా అక్కడ**
రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్లో ఆయనే షాడో ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. నియోజకవర్గంలో ఉన్న అన్ని మండలాల అధికారులు ప్రతి నిత్యం ఏది జరిగినా ఆయనకు రిపోర్టు చేయాల్సిందే అని వినిపిస్తోంది. ప్రభుత్వానికి సంబంధించిన అన్ని రివ్యూల్లోనూ తిరుపతి రెడ్డి పాల్గొంటున్నారు. ఎవరేం చేయాలో ఆయనే అధికారులకు ఆదేశాలు జారీ చేస్తారని ఆరోపణలున్నాయి. అంతటి పవర్ ఫుల్ లీడర్ను కాదని కొడంగల్ లో ఏ అధికారి కూడా పని చేయలేరని స్థానికులు చెబుతున్నారు. దీంతో ఆయననే అన్ని కార్యక్రమాలకు చీఫ్ గెస్ట్గా ఆహ్వానిస్తుంటారని తెలుస్తోంది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన కొత్తలో తన అన్న తిరుపతి రెడ్డికి పోలీసులు ఎస్కార్ట్ కూడా ఇచ్చారని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. పదుల సంఖ్యలో ఖరీదైన కార్ల కాన్వాయ్లో ఆయన నియోజకవర్గంలో తిరుగుతుండంపై దుమారం రేగింది. ఆయనకు పోలీసులు ఎస్కార్ట్ ఇచ్చి నియోజకవర్గంలో పర్యటించే వీడియో వైరల్ కావడంతో సీఎం రేవంత్ స్పందించి, తన సోదరులకు ఎస్కార్ట్ ఇవ్వొద్దని ఆదేశించారు. అయినా ప్రతి రోజు ఉదయం పోలీసులు తిరుపతిరెడ్డికి రిపోర్ట్ చేస్తారని స్థానికంగా వినిపిస్తోంది. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఆయనది కుటుంబ పాలన అని ఆరోపించిన రేవంత్ రెడ్డి ప్రస్తుతం సీఎం హోదాలో తన అన్నదమ్ములను ముందు పెట్టి పాలన సాగించడం వివాదాస్పదం అవుతోంది.

# లోక్ సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్

- ఇండియా కూటమి సమావేశంలో ఎన్నిక
- ప్రొటెం స్పీకర్ కు సోనియా గాంధీ లేఖ
- పదేండ్ల తర్వాత తొలిసారి ప్రతిపక్ష నేత

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**



ఇటీవల జరిగిన లోక్సభ ఎన్నికల్లో కాంగ్రెస్తోపాటు 25 కు పైగా పార్టీలన్నీ కలిసి ఇండియా కూటమిగా పోటీ చేసి కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి గట్టి ఎదురుదెబ్బ కొట్టాయి. ఇండియా కూటమి దెబ్బకు గతంలో సొంతంగా మెజార్టీ సాధించిన బీజేపీ.. ఈసారి మెజార్టీ మార్కును అందుకోలేకపోయింది. అంతేకాకుండా మిత్రపక్షాల మద్దతుతో తొలిసారి నరేంద్ర మోదీ సంకీర్ణ ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. ఈ క్రమంలోనే గత కొన్ని దశాబ్దాలుగా లేని సాంప్రదాయం ప్రస్తుతం లోక్సభలో కనిపిస్తోంది. లోక్సభ స్పీకర్గా అధికార పార్టీ ఏకగ్రీవంగా ఎన్నిక చేస్తుండగా.. చాలా ఏళ్ల తర్వాత ప్రతిపక్ష పార్టీ కూడా ఒక అభ్యర్థిని ప్రకటించడంతో లోక్సభ స్పీకర్ పదవికి ఎన్నిక జరగనుంది. ఈ క్రమంలోనే ఇండియా కూటమి కీలక నిర్ణయం తీసుకుంది.

ఇండియా కూటమిలో అతిపెద్ద పార్టీగా ఉన్న కాంగ్రెస్ పార్టీకి కీలక పదవి దక్కింది. ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి.. లోక్సభలో ప్రతిపక్ష నేత పదవిని కట్టబెడుతూ ఇండియా కూటమి పార్టీలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. తాజాగా జరిగిన ఇండియా కూటమి సమావేశంలో రాహుల్ గాంధీన లోక్సభలో ప్రతిపక్ష నేతగా ఎన్నుకున్నట్లు తాజాగా కాంగ్రెస్ పార్టీ వెల్లడించింది. అయితే బుధవారం లోక్సభలో స్పీకర్ పదవికి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాహుల్ గాంధీని లోక్సభలో ప్రతిపక్ష నేతగా ఎన్నుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇక మంగళవారం లోక్సభలో జరిగిన ఎంపీల ప్రమాణ స్వీకారం సందర్భంగా రాహుల్ గాంధీ కూడా ఎంపీగా ప్రమాణం చేశారు. 18 వ లోక్సభకు సంబంధించి బుధవారం స్పీకర్ ఎన్నిక జరగనుంది. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష ఇండియా కూటమిని మొత్తం ఏకతాటిపైకి తీసుకురావాల్సిన అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే లోక్సభలో ప్రతిపక్ష నేత బాధ్యతలను రాహుల్ గాంధీ స్వీకరించారు. ఈ మేరకు ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్కు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత సోనియా గాంధీ లేఖ ద్వారా సమాచారాన్ని అందించారు. ఇక డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్ష ఇండియా కూటమికి కేటాయించాలన్న డిమాండ్కు అధికార ఎన్డీఏ కూటమి అంగీకరించలేదు. దీంతో స్పీకర్ పదవికి ఇండియా కూటమి తరఫున కాంగ్రెస్ ఎంపీ కె. సురేష్ బరిలోకి దిగారు. మరోవైపు.. బీజేపీ తరఫున మాజీ స్పీకర్ ఓం బిర్లా పేరును ఇప్పటికే ఎన్డీఏ కూటమి ప్రకటించింది.

# అసద్ ప్రమాణం.. తీవ్ర దుమారం

**మొదటిపేజీ తరువాయి**

ప్రమాణ స్వీకారం చేశారు. అయితే ప్రమాణ స్వీకారం ముగిసిన వెంటనే అసదుద్దీన్ ఒవైసీ వివాదాస్పద పదాలు వాడారు. ప్రమాణం పూర్తి చేస్తూ చివర్లో జై భీమ్, జై మీమ్, జై తెలంగాణ, జై పాలస్తీనా అని అసదుద్దీన్ నినాదాలు చేశారు. అసదుద్దీన్ జై పాలస్తీనా అనడంపై అధికార పక్ష నేతలు సైతం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్ పై యుద్ధంలో హమాస్ తో ఆశ్రయం ఇచ్చిన పాలస్తీనాకు భారత ఎంపీ ఎలా మద్దతు ఇస్తారని బీజేపీ ఎంపీలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. దీనిపై స్పందించిన స్పీకర్ ఆ పదాలను రికార్డ్స్ నుంచి తొలగిస్తామని చెప్పారు. ఎవరైనా వివాదాస్పద నినాదాలు చేస్తే వాటిని రికార్డ్స్ నుంచి తొలగిస్తారు. అసదుద్దీన్ వాడిన వివాదాస్పద పదాల్ని లోక్ సభ రికార్డ్స్ లో నుంచి తొలగించే అవకాశం ఉంది.

**తెలుగు ఎంపీల ప్రమాణ స్వీకారం**
చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి ఇంగ్లీషులో ప్రమాణం చేశారు. చివర్లో జై హింద్ అన్నారు. మహబూబ్ నగర్ ఎంపీగా డీకే అరుణ ప్రమాణం చేశారు. ఆమె తొలిసారి లోక్సభ ఎంపీగా పార్లమెంట్ లో అడుగుపెట్టారు. అసదుద్దీన్ కంటే ముందు మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ ప్రమాణం చేశారు. ఈటల సైతం తొలిసారి ఎంపీగా నెగ్గి పార్లమెంట్ లో కాలుపెట్టారు. ఈటల ప్రమాణం చేసి



వెళ్తుండగా.. అసదుద్దీన్ ప్రమాణం చేయడానికి స్టేజీ మీదకు వెళ్తుంటే.. బీజేపీ మిత్ర పక్షాలు జై శ్రీరామ్, జై శ్రీరామ్ అని నినాదాలు చేశారు. కేంద్ర మంత్రులు బీజేపీ సభ్యుల్ని వారించారు. ఖమ్మం ఎంపీ రఘురామిరెడ్డి ఇంగ్లీష్లో ప్రమాణం చేశారు. ప్రమాణం చేస్తూ చివర్లో జై హింద్, జై తెలంగాణ, జై సంవిధాన్ అని అన్నారు. బీజేపీ నేత, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఇంగ్లీష్లో ప్రమాణం చేశారు. గత ఎన్నికల్లోనూ నిజామాబాద్ ఎంపీగా నెగ్గిన ధర్మపురి అర్వింద్ వరుసగా రెండోసారి విజయం సాధించారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య తెలుగులో ప్రమాణం చేశారు. చివరలో కావ్య జై భీమ్, జై భద్రకాళి, సేవ్ కానిస్టిట్యూషన్ అని కడియం కావ్య నానాదాలు చేశారు.



## త్వరలో పట్టాల మీదకు

# వందేభారత్ స్లీపర్ రైలు

**మొదటిపేజీ తరువాయి**

స్లీపర్ ట్రైన్ను మరో రెండు నెలల్లో అంటే ఆగస్టు 15 నాటికి ప్రజలకు అందుబాటులో తీసుకువచ్చే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ దీనిని ప్రారంభించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్లీపర్ రైలు పనులను పర్యవేక్షించడానికి బెంగళూరు వెళ్లారు. వందేభారత్ స్లీపర్ రైలు తయారీ చివరిదశలో ఉందని ఆయన పేర్కొన్నారు. దేశంలోనే మొట్టమొదటి వందే భారత్ స్లీపర్ రైలు ఢిల్లీ, ముంబయి రైల్వే మార్గంలో నడుస్తుందని, రద్దీగా ఉండే ఈ మార్గంలో స్లీపర్ రైలును అందుబాటులోకి తీసుకువస్తే ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుందని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. స్లీపర్ ట్రైన్ ఢిల్లీ నుంచి భోపాల్, సూరత్ మీదుగా ముంబయి చేరుకుంటుందని తెలిపాయి. త్వరలో పట్టాలెక్కనున్న ఈ స్లీపర్ రైల్లో మొత్తం 16 బోగీలు ఉంటాయని అందులో 10 థర్డ్ ఏసీకి, 4 సెకండ్ ఏసీకి, ఒక బోగీ ఫస్ట్ ఏసీకి కేటాయించారని అధికార వర్గాలు పేర్కొన్నాయి. వందే భారత్ స్లీపర్ రైలులో సీటింగ్తో పాటు లగేజీ కోసం రెండు బోగీలు అందుబాటులో ఉంటాయి. గంటకు 130 కి.మీ. వేగంతో నడిచే ఈ రైలు వేగాన్ని కొద్ది రోజుల అనంతరం క్రమంగా గంటకు 160220 కి.మీ.లకు పెంచనున్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
vishalabharathi Telugu Daily
www.vishalabharati.com
epaper:vishalabharati.com
జనరల్ న్యూస్
బుధవారం, 26.06.2024 | హైదరాబాద్






# డ్రగ్స్ రహిత తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

తీసుకుందన్నారు. డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్టు వివరించారు.
నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా రాష్ట్రంలో అక్రమ రవాణా, డ్రగ్స్ నివారణకు ఎన్ని నిధులైనా పోలీస్ శాఖకు కేటాయించడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. నేటి పిల్లలే రేపటి భవిష్యత్ అని ఈ ప్రభుత్వం భావిస్తున్నందున డ్రగ్స్ నివారణకు తమ ప్రభుత్వానికి బడ్జెట్ సమస్యే కాదన్నారు. తక్కువ సమయంలో అక్రమ పద్ధతిలో ఎక్కువ మొత్తంలో డబ్బు సంపాదించాలన్న దురుద్దేశ్యంలో కొంత మంది దుర్మార్గులు యువతను డ్రగ్స్‌కు అలవాటు చేస్తున్నారన్నారు. దేశంలో బలీయంగా ఉన్న మానవవనరులను నిర్వీర్యం చేసి దేశాన్ని బలహీన పర్చాలన్న కుట్రలో భాగంగా దేశ ద్రోహులు సైతం డ్రగ్స్‌ను రవాణా చేస్తున్నారని ఇలాంటి వారి ఉచ్చులో పడి యువత తమ బంగారు భవిష్యత్తును కోల్పోవద్దని సూచించారు.
దేశ భవిష్యత్తుకు ఉపయోగపడే యువతను నిర్వీర్యం చేస్తున్న డ్రగ్సును సమూలంగా నివారించడం ప్రభుత్వం, పోలీసులతో పాటు మనందరి బాధ్యత అని మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పోలీసులు వేసే ప్రతి అడుగు మన రక్షణ కోసమే అన్న విషయాన్ని ప్రతి ఒక్కరు అర్థం చేసుకొని పోలీసులకు సహకరించాలని కోరారు. తెలంగాణ పోలీస్ వ్యవస్థ చాలా బలమైనది, తెలివైనదని, ఎంత దూరం వెళ్ళిన నిందితులను పట్టుకునే శక్తి సామర్థ్యాలు తెలంగాణ పోలీసులకు ఉన్నాయని అన్నారు.
నగరాలకి కాకుండా గ్రామాలకు విస్తరిస్తున్న మాదకద్రవ్యాల నివారణకు అన్ని గ్రామాల్లో కమిటీలు వేసి పోలీసులు సమాచార వ్యవస్థను బలోపేతం చేసుకుంటే కట్టడి చేయడం సులభం అవుతుందని మల్లు భట్టి విక్రమార్క్ సూచించారు. ప్రశాంతంగా ఆప్యాయంగా ప్రేమగా ఉన్న కుటుంబ వ్యవస్థలో డ్రగ్స్ విష ప్రయోగం లాంటిదన్న సంగతిని విద్యార్థులు గ్రహించాలన్నారు. ప్రపంచంతో పోటీపడే విధంగా విద్యార్థులు ఎదగడానికి ఈ ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేస్తున్నదని వివరించారు ప్రభుత్వానికి పన్నుల నుంచి వస్తున్న ప్రతి పైసను సద్వినియోగం చేస్తూ విద్యకు ఎక్కువ మొత్తంలో వెచ్చించి పిల్లల బంగారు భవిష్యత్తుకు తోడ్పడుతున్నామన్నారు. తాత్కాలిక వ్యసనాలకు బానిసలుగా మారితే మీ తల్లిదండ్రులతో పాటు ఈ సమాజం బాధపడుతుందన్న విషయాన్ని మర్చిపోవద్దని అన్నారు. విద్యార్థులు, యువత మంచి సహవాసంతో నడిచి భవిష్యత్తును మార్గదర్శనం చేసుకోవాలని కోరారు. కార్యక్రమం అనంతరం నెక్లెస్ రోడ్డుపై విద్యార్థుల ర్యాలీని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క జండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీజీపీ రవి గుప్తా, యాంటీ నార్కోటిక్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ ప్రలోభాలకు తలొగ్గిన ఎన్ టీ ఏ

**బిజెపి పార్టీ ఆధ్వర్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన రోజే డొల్లతనం బయటపడింది. అదే రోజు ఎన్ టి ఏ( నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) ఆధీనంలో దేశవ్యాప్తంగా వైద్య విద్య ప్రవేశాలకు జరిగే నీట్ పరీక్ష ఫలితాలు కూడా విడుదలయ్యాయి. అయితే ఈ పరీక్ష పారదర్శకంగా జరగలేదని విషయం వాటి ఫలితాలు చూస్తే మనకు అర్థమవుతుంది. ఈ పరీక్షలో ఎన్నడూ లేని విధంగా ఏకంగా 67 మంది విద్యార్థులకు 720 మార్కులకు గాను 720 మార్కులు సాధించారు. ఇందులో 7గురు విద్యార్థులు బీహార్ రాష్ట్రంలోని ఒకే పరీక్షా సెంటర్ కు చెందిన విద్యార్థులే కావడంతో అనుమానాలు మరింత బలపడ్డాయి. గత సంవత్సరం నిర్వహించిన పరీక్షలో కేవలం ఇద్దరి విద్యార్థులకే మొదటి ర్యాంకు వచ్చిందంటే ఆలోచించాల్సిన విషయమే.**

నీట్ పరీక్షను ఎన్ టి ఏ ఆధ్వర్యంలో మే5న దేశవ్యాప్తంగా నిర్వహించి వాటి ఫలితాలను మొదటగా జూన్ 14న విడుదల చేస్తామని చెప్పి తర్వాత పది రోజుల ముందుకు మార్చడంలో ఆంతర్యం ఏమిటి?. పరీక్ష నిర్వాహణలో అవకతవకలు జరిగాయి కాబట్టి ఎన్నికల ఫలితాల రోజే విడుదల చేస్తే ఎవరు దీని గురించి ఎవరు మాట్లాడరని బహుశా ఎన్ టి ఏ భావించి ఉండొచ్చు. తొలుత సుప్రీం కోర్ట్ నీట్ పరీక్ష విధానంలో ఎలాంటి అవకతవకలు జరిగలేదని భావించినా విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు తమ పిల్లలకి అన్యాయం జరిగిందని సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై సుప్రీంకోర్టు ఎన్ టి ఏ ను వివరణ అడగగా 1563 మంది విద్యార్థులకు గ్రేస్ మార్కులు కలిపామని చెప్పడంతో దేశవ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు పరీక్ష వ్రాయగా కొద్దిమందికి మాత్రమే ఎలా గ్రేస్ మార్కులు ఎలా ఇస్తారని సుప్రీంకోర్టు వాటిని రద్దు చేస్తూ తీర్పునివ్వడంతో ఆ గ్రేస్ మార్కులను ఉపసంహరించుకుంటున్నామని ఎన్ టి ఏ తెలిపింది. నీట్ పరీక్షకు ముందుగానే పేపర్ లీక్ అయిందని బలమైన ఆధారాలు ఉన్నాయి. బీహార్ రాష్ట్రంలో పరీక్షకు ఒకరోజు ముందుగానే నీట్ పేపర్ ను లీక్ చేసి కొంతమంది విద్యార్థుల దగ్గర నుంచి 30 నుండి 40 లక్షల వరకు డబ్బు తీసుకొని ఆ విద్యార్థులతో ప్రశ్నలకు జవాబులు బట్టి పట్టించారని బీహార్ పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. అలా పరీక్ష రాసిన విద్యార్థులు సైతం నిజమేనని ఒప్పుకున్నారు. దీనిని విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కూడా స్వయంగా నీట్ కు సంబంధించిన పేపర్ లీక్ అయిందని ప్రకటించారు. అంటే ఈ పరీక్ష కోసం 24 లక్షల మంది విద్యార్థులు అహర్నిశలు కష్టపడి చదివితే ఇలా పేపర్ను మార్కెట్లో ఖరీదైన వస్తువు లాగా కార్పొరేట్ కాలేజీల మాఫియా యాజమాన్యాలకు అమ్ముతారా?. కొంతమంది తమకు అనుకూలమైన విద్యార్థుల కోసం 24 లక్షల మంది విద్యార్థులకు అన్యాయం చేస్తారా?. విద్యార్థులు మా పరీక్ష పేపర్లను లీక్ చేసి మా భవిష్యత్తును అంధకారం లోకి నెడతారా? అని రోడ్లమీదకు వచ్చిన విద్యార్థులపై పోలీసులు విచక్షణ రహితంగా వాళ్లపైన లాఠీలతో దాడి చేశారు. దేశవ్యాప్తంగా వైద్య విద్య కోసం జరిగే ప్రవేశ పరీక్షలో ఇలా పారదర్శకత లోపిస్తే ఎంత మంది నాణ్యమైన వైద్యులు తయారవుతారు?. వారు తిరిగి ఆరోగ్యకరమైన సమాజాన్ని ఎలా తయారు చేయగలుగుతారు?.

నీట్ పేపర్ లీక్ సమస్య తీరకముందే ఎన్ టి ఏ వైఫల్యం మరోసారి యూజీసీ నెట్ ( యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్) పరీక్షను రద్దు చేయడం వలన బయటపడింది. ఈ నెట్ పరీక్ష దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలలో రీసెర్చ్ ఫెలోషిప్స్ లకు మరియు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అర్హత పరీక్షగా ఉంటుంది. దీనిని సంవత్సరానికి రెండుసార్లు జూన్, డిసెంబర్ నెలలలో ఎన్ టి ఏ నిర్వహిస్తుంది. జూన్ కు సంబంధించిన పరీక్ష ఈనెల 18న ఎన్ టి ఏ దేశవ్యాప్తంగా నిర్వహించింది. ఈ పరీక్ష ప్రతిసారి ఆన్లైన్ అంటే కంప్యూటర్ ద్వారా నిర్వహించేవారు. ఈసారి మాత్రం ఆఫ్లైన్ ఓఎంఆర్ షీట్ ద్వారా పరీక్ష నిర్వహించారు. పరీక్ష ముగిసి ఒక రోజైన గడవకముందే రద్దు చేస్తున్నట్లు 19వ తారీఖున కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ పరీక్ష పేపర్ ని కూడా కొంతమంది ముఠా లీక్ చేసి దీనికి ఒక్కో అభ్యర్థి దగ్గర 6 నుంచి 8 లక్షల వరకు వసూలు చేశారు. అంటే ఈ పేపర్ కూడా లీకైనట్లు చెప్పగనే చెప్పినట్లు అయింది. ఇలా 20 రోజుల వ్యవధులలో ఎన్ టి ఏ నిర్వహించిన రెండు అత్యున్నత పేపర్లు లీక్ అవడం వలన దేశవ్యాప్తంగా 30 లక్షల మంది పైగా విద్యార్థులలో ఆందోళన పరిస్థితులు నెలకొన్నాయి. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే గత మూడు నెలల క్రిందట యూజీసీ( యూనివర్సిటీ గ్రాంట్స్ కమిటీ) దేశంలో ఉన్న అన్ని యూనివర్సిటీలలో పరిశోధనలకు సంబంధించిన పీహెచ్ డి ప్రవేశాలకు నెట్ పరీక్షలో వచ్చిన మార్కులను ప్రామాణికంగా నిర్ధారించింది. ఇంతకుముందు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే సెంట్రల్ యూనివర్సిటీలలో మాత్రమే ఉండేది. ఇప్పుడు అన్ని యూనివర్సిటీలకు నెట్ లో వచ్చే మార్కుల ద్వారా పీహెచ్ డి ప్రవేశాలు కల్పించాలని యూజీసీ గైడ్ లైన్స్ జారి చేసింది. నీట్ పేపర్ లీక్ చేయడం వలన తమ భావాల గల వారిని అన్ని యూనివర్సిటీలో పీహెచ్డీ అడ్మిషన్లు కల్పించి వాళ్లకు వ్యతిరేకంగా ఉన్న పరిశోధనలను కుంటూ పట్టించడం, తమకు అనుకూలంగా ఉన్న పరిశోధనలను ప్రోత్సాహించడం బిజెపి ప్రధాన లక్ష్యం. ఇప్పటికే నూతన జాతీయ విద్యా విధానం 2020 ద్వారా విద్యను పూర్తిగా కాషాయీకరణ చేసి, అశాస్త్రీయ భావాలను విద్యా విధానంలోకి తెచ్చింది. అనేక యూనివర్సిటీలలో తమ రాజకీయ నిరుద్యోగులను ఉద్యోగులుగా నియమించింది. ఎన్ సి ఈ ఆర్ టీ బుక్ లలో పాఠ్య అంశాల కూర్పు పేరుతో జీవ పరిణామ సిద్ధాంతం, పిరియాడిక్ టేబుల్, అంబేద్కర్, భగత్ సింగ్ చరిత్రలను తొలగించి మన స్మృతి, సావర్కర్ మరియు గోల్వాల్కర్ల చరిత్రను పాఠ్యాంశాలలోకి తెస్తున్నారు. సైంటిఫిక్ టెంపర్ ను లేకుండా చేస్తున్నారు.

**నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ని రద్దు చేయాలి**

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్ టి ఏ) ను 2017 లో ఏర్పాటు చేశారు. నాటి నుండి నేటి వరకు ఈ ఏజెన్సీ ద్వారానే 17 రకాల పరీక్షలు నీట్, జైఈఈ (మెయిన్స్), జీ ప్యాట్, సి మ్యాట్, యూజీసీ నెట్ తదితర ప్రతిష్టాత్మక ప్రవేశ పరీక్షలు దీని ఆధ్వర్యంలోనే జరుగుతున్నాయి. ఇది నేడు ప్రపంచంలోనే ప్రవేశ పరీక్షలు నిర్వహించే అతిపెద్ద ఏజెన్సీలలో ఒకటిగా ఉంది. అలాంటి ఎన్ టి ఏ శాస్త్రీయంగా మరియు ప్రపంచ ప్రమాణాలతో సమానంగా పరీక్షల విధానాన్ని రూపొందించి అమలు పరచడంలో విఫలమయింది. ఈ టెస్టింగ్ ఏజెన్సీలో డైరెక్టర్ సహా సభ్యులను ప్రభుత్వమే నియమిస్తుంది. ఈ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ భావాలున్న వారిని మరియు ప్రైవేట్ విద్యావేత్తలను నియమించి తమకు అనుగుణంగా పరీక్షలు నిర్వహించుకుంటుంది. పరీక్షలు నిర్వహించడంలో ఎన్ టి ఏ పారదర్శకత లోపించింది. అందువలన ఈ ఏజెన్సీ పై విద్యార్థులు నమ్మకం కోల్పోయారు. నీట్, నెట్ పరీక్ష పేపర్ల లీకులను అరికట్టడంలో విఫలం అయింది. లీకైన నీట్ పేపర్ ను రద్దుచేసి మరల నిర్వహించాలి. ఎన్ టీ ఏను రద్దుచేసి దీనిపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపి దీని వెనక ఉన్న సూత్రధారులను కఠినంగా శిక్షించాలి. ప్రధాని మోడీ బాధ్యత వహించి నష్టపోయిన విద్యార్థులకు బహిరంగ క్షమాపణ చెప్పి విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను మంత్రి పదవి నుండి భర్తరఫ్ చేయాలి. భవిష్యత్తులో ఎలాంటి పోటీ పరీక్షల పేపర్లు లీక్ చేసిన వారిని కఠినంగా శిక్షించే చట్టాలు చేసి, దేశవ్యాప్తంగా అమలు జరిగే విధంగా చేసి విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం భరోసాగా నిలవాలి.



కంచనపల్లి శ్రీను
PDSU సిటీ ప్రధాన కార్యదర్శి
9642260576

# మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

- **సీజన్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలి**

**వనపర్తి , విశాల భారతి:** సీజనల్ వ్యాధుల నివారణకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మున్సిపల్ కమిషనర్ లు, రోడ్లు భవనాలు, మిషన్ భగీరథ అధికారులతో సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యల పై సమీక్ష నిర్వహించారు. వర్షాకాలంలో దోమలు పెరిగి డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, టైఫాయిడ్, డయేరియా వంటి అంటువ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ లు క్షేత్రస్థాయిలో పర్యటించి పారిశుధ్య పనులు, డ్రైనేజ్ వ్యవస్థలు, ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రై డే కార్యక్రమాన్ని దగ్గరుండి పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రై డే పై ప్రజలకు అవగాహన కల్పించాలని, అంగన్వాడి, ఆశా వర్కర్లను భాగస్వాములు చేయాలని సూచించారు. ఫ్లెక్సీలు పెట్టిన వారి నుండి రుసుము వసూలు చేయాలని స్వపక్షం, ప్రతిపక్షం అనే తేడా లేకుండా ప్రతి ఫ్లెక్సీకి రుసుము విధించి పెట్టిన వారి నుండి వసూలు చేయాలని సూచించారు. ప్రోగ్రాం అయిన మరుసటి రోజు ఫ్లెక్సీ తొలగించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని రెస్టారెంట్ లు, హోటళ్ళలో తనిఖీలు చేయాలని, సూచి శుభ్రత, వాడుతున్న ఆహార పదార్థాలు, కూరగాయలు నాణ్యత పరిశీలించి నిబంధన లు పాటించని వారి పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, రోడ్లు భవనాల కార్యనిర్వహక ఇంజనీరు దేశ్యా నాయక్, మిషన్ భగీరథ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.





# కొనసాగుతున్న బుజ్జగింపులు

- **జీవన్ రెడ్డి నో కాంప్రమైజ్**
- **మంత్రి పదవి ఆఫర్ ఇచ్చినట్టు వార్తలు**

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తన రాజీనామాపై వెనక్కి తగ్గినట్లు సమాచారం. సోమవారం జీవన్ రెడ్డితో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు జీవన్‌రెడ్డి నివాసంలో ఏకాంత చర్చలు జరిపారు. రేపు సీఎం హైదరాబాద్‌కు వచ్చి మాట్లాడిన తర్వాత మీరు ఏం నిర్ణయం తీసుకున్నా అది మీ ఇష్టం. అప్పటి దాకా మా మాట వినాలని శ్రీధర్ బాబు, భట్టి కోరారు. అనంతరం పార్టీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్‌తో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫోన్‌లో మాట్లాడించారు. కేసీతో ఫోన్లో మాట్లాడిన తర్వాత జీవన్ రెడ్డి తన రాజీనామా విషయంలో వెనక్కి తగ్గారు. అయితే జీవన్ రెడ్డికి కేసీ వేణుగోపాల్ మంత్రి పదవి? ఆఫర్ చేసిట్లు తెలిసింది. అందుకే ఆయన రాజీనామా విషయంలో వెనక్కి తగ్గారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కాగా, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడంపై జీవన్ రెడ్డి ఆగ్రహంగా ఉన్నారు. ఆయన చేరికపై పార్టీ అధిష్ఠానం కనీసం తనకు సమాచారం ఇవ్వకపోవడంతో అసనం వ్యక్తంచేశబూరు. ఈ నేపథ్యంలో తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. 2014లో జీవన్‌రెడ్డి చేతిలో ఓడిపోయిన సంజయ్.. ఆ తర్వాత జరిగిన 2018, 2023 ఎన్నికల్లో ఆయనపై విజయం సాధించిన విషయం తెలిసిందే.



# తైబజార్ వేలం పాట రద్దు చేయండి

- **తైబజార్ వసూళ్లు నిలిపివేయాలని బి.ఆర్.ఎస్ కౌన్సిలర్స్ డిమాండ్...**

**వనపర్తి విశాల భారతి :** తైబజార్ వేలం పైసలు వసూళ్లు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నరని బిఆర్ఎస్ కౌన్సిలర్లు తైబజార్ వేలం పాటను రద్దు చేయాలని కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు. వేలం పాట రద్దు చేయాలని పేద ప్రజలు చిరు వ్యాపారుల దగ్గర తైబజార్ పేరుతొ పైసలు వసూల్ చేసే ప్రక్రియ వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ కౌన్సిలర్స్ మాట్లాడుతూ.. మూడు రోజుల ముందు కౌన్సిల్ అందరికీ నోటీసులు ఇచ్చి పట్టణములో ప్రచారం నిర్వహించి వేలం నిర్వహించాలని, నిబంధనలు ప్రకారం వేలం పాట పాడే పద్ధతిని మర్చిచి కాంట్రాక్టర్ లతో కుమ్మక్కై వేలం పాట నిర్వహించడాని సరికాదన్నారు. దీంతో వేలం పాట రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కమిషనర్ స్పందిస్తూ నిబ్బంధనల ప్రకారం నిర్వహిస్తం అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ బండారు.కృష్ణ,నాగన్న యాదవ్,కంచె.రవి,మాజీ కౌన్సిలర్ తిరుమల్,స్టార్. రహీమ్ పాల్గొన్నారు.

# పార్టీ మారిన ఎమ్మెల్యేల సభ్యత్వాలు రద్దు కావాలి

**- ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి**

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన ఎమ్మెల్యేలపై సూర్యాపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల సభ్యత్వాలు రద్దు కావాల్సి ఉందన్నారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. చట్టం ప్రకారం డాక్టర్ సంజయ్, పోచారం శ్రీనివాస్ రెడ్డి సభ్యత్వాలు రద్దు కావాలి. ఆ ఇద్దరు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్ ఇచ్చేందుకు స్పీకర్‌ను సమయం కోరాం. వెసులుబాటు చూసుకొని సమయం ఇస్తానని స్పీకర్ చెప్పారు. స్పీకర్ న్యాయంగా సమయం ఇస్తారని ఆశిస్తున్నాం. అనర్హత పిటిషన్లపై ఈ నెల 27న హైకోర్టులో విచారణ ఉంది. కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలను వంచిస్తోంది. రాహుల్ కాంగ్రెస్‌ది ఒక విధానం.. రేవంత్ కాంగ్రెస్‌ది మరో విధానం. గత పదేండ్లలో ఫిరాయింపులను ప్రోత్సహించింది బీజేపీ. బీజేపీకి తోకగా తెలంగాణ పీసీసీ వ్యవహరిస్తోంది అని జగదీశ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.
బాన్సువాడ, జగిత్యాల ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, సంజయ్.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్‌పై గెలుపొందారు. వీరిద్దరిని రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు. ఈ నేపథ్యంలో ఆ ఇద్దరిపై గులాబీ శ్రేణులు మండిపడుతున్నారు. ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.





# పెండింగ్ లో ఉన్న సీఎంఆర్ రైస్ ఇవ్వాల్సిందే

**వనపర్తి, విశాల భారతి:** రైస్ మిల్లర్లు ఎఫ్.సీ.ఐ కి ఇవ్వాల్సిన సీ.ఎం.ఆర్ ధాన్యాన్ని అప్పగించే ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం వనపర్తి శివారులోని రాఘవేంద్ర ఇండస్ట్రీస్, చిట్యాల గోడౌన్, పెద్దమందడి మండలం వీరాయ పల్లిలో ఉన్న మల్లిఖార్జున ఇండస్ట్రీస్ రైస్ మిల్లులను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. మిల్లులలో రికార్డులను తనిఖీ చేశారు. రోజుకు మిల్లింగ్ సామర్థ్యం ఎంత? ఎంతమేర ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిట్యాల గోడౌన్ లో ఎస్.పీ.ఆర్ స్టాక్స్ తనిఖీ చేశారు. రాఘవేంద్ర ఇండస్ట్రీస్ రైస్ మిల్ ఖరీఫ్ 202324 సీజన్ కి గాను గత మార్చి నుంచి నేటికీ 12 ఏసీకేలు మాత్రమే డెలివరీ చేసిందని, మిగతా 43 ఏసీకేల ధాన్యాన్ని త్వరగా అప్పగించాలని ఆదేశించారు. అదేవిధంగా మిల్లింగ్ విషయంలో మిల్లర్లకు ఉన్న ఇబ్బందులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మల్లిఖార్జున ఇండస్ట్రీస్ 202223 ఖరీఫ్ సీజన్ లో కేవలం 11ఏసీకే ల ధాన్యం మాత్రమే అప్పగించారని, మిగతా ధాన్యం త్వరగా అప్పగించాలని అన్నారు. లేని పక్షంలో రెవెన్యూ రికవరి చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పౌర సరఫరాల కార్పొరేషన్ మేనేజర్ షేక్ ఇర్ఫాన్, డిటీ నంద కిషోర్, ఇతర అధికారులు సిబ్బంది తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.



# పెండింగ్‌లో ఉన్న రోడ్ల విస్తరణ పనులు పూర్తి చేయండి

**వనపర్తి, విశాల భారతి:** బిఆర్ఎస్ హయంలో జిల్లా కేంద్రంతో పాటు, నియోజకవర్గానికి సంబంధించిన బైపాస్ రోడ్ల పనులను వేగవంతం చేసేందుకు మాజీమంత్రి నిరంజన్ రెడ్డి కృషిచేసి నిధులు తెచ్చారని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ అన్నారు. మంగళవారం రోడ్లు ,భవనాల శాఖ ఎస్సీకి బిఆర్ఎస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గట్టు యాదవ్ మాట్లాడుతూ.. రోడ్ల విస్తరణ కోసం నిధులు ఉన్నా పనులు మాత్రం అసంపూర్తిగా ఉన్నాయని అన్నారు. 90 శాతం పనులు బిఆర్ఎస్ హయాంలోనే జరిగిందని, పది శాతం పనులు చేయలేకపోవడం విడ్డూరమని అన్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్న ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉందన్నారు. ప్రజలకు, ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మొరపెడుతున్నారన్నారు. ఉన్న నిధులను సద్వినియోగం చేసుకొని పెండింగ్లో ఉన్న పనులు సత్వరమే పూర్తిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాకిటి శ్రీధర్, మాజీ మున్సిపల్ చైర్మన్ రమేష్‌గౌడ్, పలువురు కౌన్సిలర్లు, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
vishalabharathi Telugu Daily
www.vishalabharati.com
epaper:vishalabharati.com
జనరల్ న్యూస్
బుధవారం, 26.06.2024
హైదరాబాద్





# ప్రీ ప్రైమరీలో వద్దు.. అంగన్వాడీలో ముద్దు

**చిట్యాల, విశాలభారతి:** ప్రభుత్వపరంగా ప్రీ ప్రైమరీ అనుమతులు ఇవ్వడం ద్వారా తల్లిదండ్రులు ప్రైవేటు విద్యాసంస్థల వైపు మొగ్గు చూపుతున్నారని అంగన్వాడీ టీచర్లు అన్నారు. మంగళవారం చిట్యాల మండల విద్యాధికారి కార్యాలయం ముందు అంగన్వాడీ టీచర్లు ధర్నా నిర్వహించారు. సందర్భంగా అంగన్వాడీ టీచర్లు మాట్లాడుతూ చిట్యాల మండలములో మొత్తము 52 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయని 52 అంగన్వాడీ కేంద్రాలలో మూడు నుండి ఆరు సంవత్సరాల పిల్లలను పంపించడం లేదని అందరూ ప్రైవేట్ స్కూల్స్ బస్సులలో పిల్లలను పంపించడం జరుగుతుంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలలో ప్రీ ప్రైమరీ స్కూల్స్ కి అనుమతి ఇవ్వడం వల్ల ప్రైవేట్ విద్యాసంస్థల వైపు మొగ్గు చూపడం జరుగుతుందని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో ఐదు సంవత్సరాలు నిండే వరకు పిల్లలకు పౌష్టిక ఆహారం అందించడం జరుగుతుంది. శారీరకంగా మానసికంగా అభివృద్ధి చెందడం జరుగుతుంది. ప్రైవేట్ పాఠశాలల్లో నిర్భయ చదువును వ్యతిరేకిస్తున్నామని అన్నారు. దీనివలన అంగన్వాడీ కేంద్రాలు మూసివేతకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ ఎంఈఓ కూకుంట్ల నర్సింహకి నిరసన తెలిపారు. అనంతరం ఎంఈఓ కార్యాలయ సిబ్బంది వరలక్ష్మి,సరిత కు వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు దాడి అరణ,పైళ్ళ పద్మ, లలిత, అలివేలు మంగ, జానకమ్మ, పరమేశ్వరి, అండాలు భాగ్యమ్మ, నాగమణి, పుష్పలత ధనమ్మ, మంగమ్మ, సరిత, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.



# స్త్రీ పురుష సమానత్వం కై పోరాడుదాం

- స్త్రీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలి

**బయ్యారం, విశాలభారతి:** ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యూ) బయ్యారం మండల మహాసభ ఈరోజు వెంకట్రాంపురం కామ్రేడ్ దొరన్న స్మారక భవన్లో కామ్రేడ్ సుసేన. కామ్రేడ్ గడ్డం వెంకట నరసమ్మ నగర్ లో బొల్లం సోమక్క అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సభలో పిఓడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎస్ కవిత. ఎండి కవితలు మాట్లాడుతూ... దేశంలో రాష్ట్రంలో మహిళలపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, రోజురోజుకు పెరిగిపోతున్నాయని వీటిని అరికట్టడంలో మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నాయని అన్నారు. ముఖ్యంగా పసిపాపల పైన, ఆదివాసి, దళిత, బలహీనవర్గాల మహిళలపై దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వలన తిరిగి పునరావృత్తమవుతున్నాయని వారన్నారు. మహిళలపై వివక్షత, దాడులకు, దౌర్జన్యాలకు, హత్యలకు, వ్యతిరేకంగా స్త్రీపురుష సమానత్వం కై మహిళలందరూ ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ సభలో కొండ సాయమ్మ, ఈడబోయిన సుగుణ, ఎర్రమళ్ళ మంగమ్మ, మొగలగాని నాగమణి, కన్నెబోయిన లత, బచ్చలి రత్న, యాదమ్మ, ఉపేంద్ర, అండమ్మ, కవిత, అనసూర్య, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.




# వెంకట్రాంపురం పాఠశాలను సందర్శించిన డిఇఓ

**బయ్యారం ,విశాలభారతి:** డిఇఓ పి రామారావు బయ్యారం మండలం ఆకస్మిక తనిఖీలో భాగంగా జడ్పీహెచ్ఎస్ వెంకటరాంపురం పాఠశాలను సందర్శించి ప్రస్తుత విద్య సంవత్సరం 10వ తరగతి విద్యార్థులకు 100 శాతం రిజల్ట్స్ రావాలని జిపిఏ 10/10 లు అందరూ విద్యార్థులు సాధించాలని పాఠశాల పేరు ప్రఖ్యాతలు నిలబెట్టే విధంగా ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. 6 నుంచి 10వ తరగతి తెలుగు పాఠ్య పుస్తకాల్లో ముందు మాట పేజీ చింపి క్యూఆర్ కోడ్ కనిపించకుండా మరల పుస్తకాన్ని అంటించడం చేయాలి. బయట వైపు వందే మాతరం, జాతీయ గీతం కనిపించేలా, చేశారా లేదా అనే విషయంపై తెలుగు పాఠ్యపుస్తకాలను పరిశీలించారు. 8, 9 చదివే విద్యార్థులను సబ్జెక్టుకు సంబంధించి పూర్వ విజ్ఞానాన్ని రాబట్టారు. పదవ తరగతి విద్యార్థులు మొదటి ఈఎం బ్యాచ్ అయినా కూడా ఏమాత్రం ఇబ్బంది పడకుండా జిపిఏ 10/10 మార్కులను అన్ని సబ్జెక్టులలో పొందే విధంగా ఉపాధ్యాయుల సహకారంతో 100 శాతం రిజల్ట్ తో ఉత్తీర్ణులు కావాలని కోరారు. అందుకు తగిన విధంగా విద్యార్థులు ఆబ్సెంట్ లేకుండా చూడాలి. పాఠశాల నమోదు పెంచాలి. ఆబ్సెంట్ విద్యార్థుల వివరాలను మరియు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తగిన శ్రద్ధ తీసుకోవాలని హెచ్ఎం ఉపాధ్యాయులను కోరారు. మార్కుల గ్రేడు వివరాలను విద్యార్థులు ముఖ్యంగా 9, 10 తరగతి వారు పూర్తి స్థాయిగా తెలుసుకునే విధంగా నమోదు చేసుకొని అందుకు తగ్గట్టుగా జిపిఏ గ్రేడింగ్ స్థాయి పెంచుకోవాలని సూచన చేశారు. విద్యార్థులందరూ పాఠశాలకు ఎక్కడ నుంచి ఏ విధంగా వస్తున్నారు. అనే విషయాలను ప్రతి పదో తరగతి విద్యార్థిని అడిగి తెలుసుకుని మంచి ఆరోగ్యంగా 10/10 జిపిఏ మార్కులతో ఉత్తీర్ణత కావాలని కోరారు. హెచ్ఎం ఉపాధ్యాయులకు గుర్తు చేస్తూ తగిన విధంగా కృషి చేయాలని తెలియజేశారు.

# చిగురుమామిడి పాలకేంద్రం అధ్యక్షుడిగా శ్రీధర్ రెడ్డి

- 13వ సారి శ్రీధర్ రెడ్డి ఏకగ్రీవంపై పలువురి హర్షం..



**చిగురుమామిడి, విశాల భారతి:** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి గ్రామంలోని కరీంనగర్ డెయిరీ అధ్యక్షుడిగా పన్యాల శ్రీధర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం పాలకేంద్రంలో జరిగిన సమావేశంలో అధ్యక్షుడితో పాటు ముగ్గురు డైరెక్టర్లను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పన్యాల శ్రీధర్ రెడ్డి 13వసారి ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, డైరెక్టర్లుగా చొప్పదండి సుధాకర్, పోతరవేణి అనిల్,పోలోజు రజితలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పన్యాల శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనను 13వసారి అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు డైరెక్టర్లకు,పాల ఉత్పత్తిదారులకు ధన్యవాదాలు తెలియజేశారు. పాలఉత్పత్తిదారుల సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం పని చేస్తానని వెల్లడించారు. శ్రీధర్ రెడ్డి ఎన్నిక పట్ల పాల ఉత్పత్తిదారులు, డైరెక్టర్లు హర్ష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ బిఎంసియు మేనేజర్ చింతపూల నాగయ్య, రూట్ సూపర్వైజర్లు అప్పల మల్లయ్య, సీతా రవి, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఆరోగ్యానికి ప్రముఖ స్థానం ఇస్తున్నాం

- రెండో రోజు కొనసాగిన డ్రైనేజీ క్లీనింగ్ పనులు
- పనులను పరిశీలించిన డిఎల్పిఓ, సీఐ



**పినపాక, విశాలభారతి:** ప్రజా ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించిందని కార్యక్రమంలో భాగంగా ఈ బయ్యారం క్రాస్ రోడ్ లో నీరు నిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించి డ్రైనేజీలో నీరు నిలవకుండా ఉండేందుకు చర్యలు చేపట్టినట్లుగా డి ఎల్ పి ఓ సుధీర్ కుమార్ తెలియజేశారు. రెండో రోజు కొనసాగిన డ్రైనేజీ క్లీనింగ్ పనులను ఆయన దగ్గరుండి స్థానిక సీఐ కరుణాకర్ తో కలిసి పరిశీలించారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా జిల్లా కలెక్టర్, డిపిఓ గ్రామపంచాయతీలలో నీరు నిలవకుండా చూడాలని ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు ముందుగానే అప్రమత్తమయ్యారు. గత పది సంవత్సరాలుగా డ్రైనేజీలు క్లీనింగ్ లేకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించిన ఎంపీఓ వెంకటేశ్వరరావు స్వయంగా రంగంలోకి దిగారు. గ్రామపంచాయతీ సెక్రటరీల సహకారంతో సిబ్బందిని పూర్తిస్థాయిలో వినియోగించుకొని డ్రైనేజీ క్లీనింగ్ పనులను చేపట్టారు. గతంలో రోడ్డు ప్రమాదాలు అనేకం క్రాస్ రోడ్ లో జరిగాయని తాను వచ్చిన సంవత్సర కాలంలో అనేక మంది నుంచి ఫిర్యాదులు రావడంతో 20 అడుగుల మేర రోడ్డు ఆక్రమిత విస్తరణ పనులు చేశామని, గతంలో ఆర్అండ్బి వారు కోట్ల రూపాయలతో డ్రైనేజీ నిర్మించిన అది ఉపయోగంగా ఉండి దోమలు చేరి జ్వరాలు వస్తున్నాయని గమనించిన ఎంపీఓ వెంకటేశ్వరరావు డిపిఓ కు, డిఎల్పిఓకు సమాచారం అందించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రటరీలు జైపాల్ రెడ్డి, చంద్రకుమార్, ఆదినారాయణ, సాంబశివ రావు, కాంగ్రెస్ నాయకులు గంగిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ఆదరిస్తారని నమ్మితే నట్టేట ముంచారు



**సూర్యాపేట, విశాలభారతి:** వృద్ధాప్యంలో ఉన్న తమ బాగోగులు చూసుకుంటామని నమ్మించి తమ భూమిని , బ్యాంకులో దాచిన సొమ్ముని స్వాహా చేసి తమని నడి రోడ్డు పై వదిలేశారని తమకు న్యాయం చేయాలంటూ జిల్లా కలెక్టర్ ని వేడుకుంటున్నారు వృద్ధ దంపతులు. వివరాల్లోకి వెళితే మద్దిరాల మండల కేంద్రానికి చెందిన గురువోజు గోపయ్య దంపతులకు ఇద్దరు కుమారులు , ఇద్దరు కూతుళ్ళు ఉన్నారు . ఇద్దరు కూతుళ్ళకు వివాహం కాగా , చిన్న కుమారుడు ఇటీవలే మృతి చెందాడు. వారి పేరు మీద ఎకరం 12 గుంటల పొలం ఉండగా , బ్యాంకులో లక్ష రూపాయలు డిపాజిట్ చేసి ఉంచి వారి సంరక్షణ చూస్తున్నాడు . కొద్దీ రోజులు సంరక్షణ చూసుకుంటానని చెప్పి నమ్మించి చిన్న కూతురు కట్టకోజు పద్మ, మనవడు నాగరాజు గ్రామం మండలం మద్దిరాల తమ ఇంటికి తీసుకెళ్ళింది తమకు తెలియకుండా తమ ఆస్తిని కాజేసిందని న్యాయం చేయాలంటూ వేడుకుంటున్నారు. ఆ వృద్ధ దంపతులు తమ తల్లి తండ్రుల దగ్గర ఉన్న ఆస్తి కాజేయాలనే తలంపుతో తమ చిన్న సోదరి వృద్ధులను కొన్ని రోజులు చూసుకుంటానని నమ్మించి తన ఇంటికి తీసుకెళ్ళిందని , అనంతరం వారికి మాయమాటలు చెప్పి తమ పై లేనిపోని అపోహలు కల్పించి సంవత్సర కాలంగా తమ దగ్గరకు రాకుండా చేసిందని వికలాంగుల పెన్షన్ ఇప్పించే నెపంతో డూప్లికేట్ పాసుపుస్తకాలు సృష్టించి 1.12 ఎకరాల పొలం అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవడమే కాక బ్యాంకులో డిపాజిట్ చేసిన మొత్తాన్ని కాజేశారని వాపోయాడు.



# రోడ్డు భద్రతకు కృషి చేయాలి

- ఎస్పి సన్ ప్రీత్ సింగ్

**సూర్యాపేట, విశాలభారతి:** జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎస్పి సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్ పోలీస్ స్టేషన్ ల సందర్శనలో భాగంగా మంగళవారం డీఎస్పీ రవి తో కలిసి సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్,సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంను సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పి స్టేషన్, మండల పరిధి రూట్ మ్యాప్ లను, స్టేషన్ రికార్డ్స్ పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృతంగా తనిఖీలు చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారి 65 ఎక్కువగా విస్తరించి ఉన్నందున రోడ్డు భద్రత చర్యలు తీసుకొని రోడ్డు ప్రమాదాల నివారణకోసం కృషి చేయాలని ఆదేశించారు. గ్రామాల పై ఎక్కువగా దృష్టి పెట్టిన సమస్యలను గుర్తించి నేరాలు జరగకుండా, గొడవలు జరగకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.ఎస్పి వెంట డీఎస్పీ రవి, సీఐ సురేందర్ రెడ్డి, ఎస్ఐ బాలు నాయక్ ఉన్నారు.




# గర్భస్థ లింగ నిర్ధారణ నేరం


- ఆదనపు కలెక్టర్ బి.ఎస్.లత

**సూర్యాపేట, విశాలభారతి:** గర్భస్థ లింగ నిర్ధారణ నేరమని అదనపు కలెక్టర్ బి.ఎస్. లత అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖలోని మహిళా సాధికారత కేంద్రం కేంద్ర ప్రభుత్వం ఇచ్చినటువంటి 100 రోజులు స్పెషల్ అవేర్నస్ క్యాంపైన్ లో భాగంగా మంగళవారం పిసిపిఎన్డిటి అలాగే ఎంటిపీ చట్టంపై అవగాహనా కార్యక్రమం జిల్లా సంక్షేమ అధికారి జ్యోతి పద్మ ఆధ్వర్యంలో హెల్త్ డిపార్ట్మెంట్ వారితో కలిసి ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని అన్నారు. గర్భిణులకు స్కానింగ్ అనేది బిడ్డ ఎదుగుదల తెలుసుకోడానికే తప్ప కడుపులో బిడ్డ జెండర్ తెలిపేందుకు కాదని అలా తెలుసుకొని ఆడపిల్ల అని తెలిస్తే గర్భంలోనే ఆడపిల్లని చంపేయడం నేరమని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జయ ప్రోగ్రాం ఆఫీసర్, అంజయ్య మీడియా ఆఫీసర్ లు రిసార్స్ పర్సన్స్ గా పి సిపిఎన్ డిటి, ఎంటిపీ చట్టాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమం లో మెడికల్ ఆఫీసర్ లు, ఏఎన్ఎం లు,సఖి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశాలు, సంకల్ప, మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

# అమ్మిన ప్రతి విత్తనానికి రసీదులు ఇవ్వాలి

- జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు

**పినపాక, విశాలభారతి:** రైతులకు విత్తనాలు ,ఎరువులు అమ్మితే రసీదులు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు సూచించారు. మంగళవారం పినపాక మండలంలో ఆయన ఆకస్మికంగా పర్యటించి పలు పెర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీ చేశారు. సీతంపేట, ఈ బయ్యారం, పినపాక గ్రామంలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విత్తనాలు కొన్న రసీదులను రైతులు పంట పూర్తయ్యే వరకు తమ దగ్గరే ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పినపాక మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, విస్తరణ అధికారి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.





# సికిల్ సెల్ అనీమియా అవగాహన ర్యాలీ

- ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతున్న సిడిపిఓ నవ్యశ్రీ

**భద్రాచలం విశాలభారతి:** పట్టణంలోని ఎండిఓ ఆఫీస్ ఎదురుగా అంగనవాడి టీచర్స్ సికిల్ సెల్ అనీమియా అవగాహన ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ ర్యాలీని ఉద్దేశించి టిడిపి ఓ నవ్యశ్రీ మాట్లాడుతూ.. జూన్ 19 నుండి జూలై 3 వరకు ప్రతి పీహెచ్సీ సబ్ సెంటర్లో అంగనవాడి సెంటర్స్ నందు సికిల్ సెల్ అనీమియా స్క్రీనింగ్ టెస్ట్ లు చేస్తారని ఆమె తెలిపారు. ఈ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండేందుకు అంగన్వాడీలు కృషి చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. 40 సంవత్సరాలలోపు వారు టెస్ట్ చేయించుకోవాలని అంగన్వాడీ టీచర్స్ వారి పరిధిలో ఉన్న అంగన్వాడి సెంటర్లకు తీసుకువచ్చి టెస్టులు చేయించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ నవ్యశ్రీ, సూపర్వైజర్ స్వరూప, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ మౌనిక, అంగన్వాడీ టీచర్స్ అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు.



# పాఠ్యపుస్తకాల అమ్మకంపై చర్యలు తీసుకోవాలి

- పిడిఎస్యూ, పివైఎల్

**సూర్యాపేట, విశాలభారతి:** ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ, పాఠ్యపుస్తకాల అమ్మకంపై చర్యలు తీసుకోవాలని సూర్యాపేట జిల్లా డిఈఓకు పిడిఎస్యూ, పివైఎల్ ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిరణ్, జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి, పివైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి. రవి పాల్గొని మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో ఫీజుల దోపిడీ విపరీతంగా పెరిగిపోయాయని, విద్యార్థులు తల్లిదండ్రులకు మోయరాని భారంగా మారిందని అన్నారు. ఫీజుల నియంత్రణ చట్టం అమలు కాకపోవటం మూలంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో ఫీజులు విపరీతంగా పెంచి దోపిడీకి పాల్పడుతున్నాయని,ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని అన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో పాఠ్య పుస్తకాలు అమ్మకాలు జరపవద్దని అధికారులు చెబుతున్నప్పటికీ పెడచెవిన పెట్టి విచ్చలవిడిగా పాఠ్య పుస్తకాలు అమ్ముతూ విద్యాసంస్థలు అనేక రకాల వ్యాపారం కొనసాగిస్తున్నాయని విమర్శించారు. జిల్లావ్యాప్తంగా ఉన్నటువంటి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో జరుగుతున్నటువంటి ఫీజుల దోపిడీ, పాఠ్య పుస్తకాల అమ్మకాలపై వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు డివిజన్ ప్రధాన కార్యదర్శి పిడమర్తి భరత్, పి వై ఎల్ జిల్లా ఉపాధ్యక్షులు మున్నా అశోక్, కోశాధికారి బండి రవి, జిల్లా నాయకులు శీను తదితరులు పాల్గొన్నారు.



# పాలకవర్గ సభ్యులని సన్మానించిన ఎమ్మెల్యే

**చిట్యాల, విశాలభారతి:** మదర్ డైరీ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం నూతన చైర్మన్ గా వరకాంతం నరేందర్ రెడ్డి డైరెక్టర్ లు జిట్టా రవి, చిర్రబోయిన యాదయ్య, రేముడల ఆనంద్, యాస దేవేందరమ్మ, సూదిరెడ్డి లక్ష్మారెడ్డి, జిట్టా యాదయ్య, చిర్రబోయిన రమేష్, పెద్దగోని ముత్యాలు,మాంద్ర గణేష్ ఎన్నికయ్యారు. నూతన పాలకవర్గం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశమును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల సంఘం చైర్మన్ పలకవర్గ సభ్యులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. రైతు సమస్యలు పరిష్కరిస్తూ రైతులకు అందుబాటులో ఉంటూ సంఘం అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జడల చిన్న మల్లయ్య యాదవ్, ఎద్దులపూరి కృష్ణ, బొబ్బలి రాంరెడ్డి, అమరోజు మదన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉద్యమానికి సిద్ధం

- డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి
- పోటీ పరీక్షల విద్యార్థుల డిమాండ్

**నిజామాబాద్, విశాలభారతి:** జిల్లా కేంద్రంలోని ప్రాంతీయ గ్రంథాలయం వద్ద పోటి పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు, నిరుద్యోగులు నిరసనకు దిగారు. ఉద్యోగ నియామకాలు చేపట్టాలని విద్యార్థి సంఘాల నాయకులు వినతి పత్రాన్ని సమర్పించారు. ఇందులో బాగంగా బివిఎమ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ బట్టు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. లేని యెడల ప్రభుత్వం పై పెద్దయెత్తున ఆందోళనలు చేపడుతాం అన్నారు. కోట్లాది సాధించుకున్న తెలంగాణలో కొలువుల జాతర కోసం కొట్లాడటం సిగ్గు చేటని, గత ప్రభుత్వం చేసిన తప్పిదమే ఇపుడు కాంగ్రెస్ చేస్తుందని ఆరోపించారు. విద్యార్థుల సంక్షేమాన్ని పక్కన పెట్టి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడటం సిగ్గు చేటని మండిపడ్డారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు , ఉద్యోగ ఆశావహులు శంకర్, లక్ష్మణ్, ప్రవీణ్, నర్సయ్య, స్పందన, రుక్మిణి, కృష్ణవేణి, రాధిక, చంద్రభాగ్య, స్వరూపరాణి, విమల, మమత, వీణా, లత, కల్పన, జ్యోతి, మహాలక్ష్మి, మధుకర్, తదితరులు పాల్గొన్నారు.




## మానవత్వం చాటుకున్న ముజీబ్

- తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం
- ఆర్థిక సహాయం అందజేత

**హైదరాబాద్, విశాలభారతి:** తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ ఎం హుస్సేనీ తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ తన చిన్ననాటి స్నేహితుడైన రఘు రెండు సంవత్సరముల క్రితం అనుకోని పరిస్థితులలో మరణించాడని, గత సంవత్సరం అతని భార్య కూడా మరణించందని అన్నారు. దీంతో ఏకైక కుమార్తె దివ్య దిక్కులేకుండా అయ్యిందని బాధపడ్డారు. మిత్ర ధర్మం ఆచరించి దివ్య ఆలనాపాలనా తాను తన కుటుంసభ్యులు భాద్యత తీసుకుంటామని తెలిపారు. దివ్య చదువుతో పాటు వివాహ భాద్యత కూడా తమదేనని అభయం ఇచ్చారు. ఈ కార్యక్రమములో జిల్లా కార్యదర్శి విక్రమ్ కుమార్ తో జిల్లా సంఘ కార్యవర్గం పాల్గొన్నారు.




## కార్యకర్తలకు అండగా బిఆర్ఎస్ పార్టీ

- బోయిని మనోజ్ కుమార్ కు భీమా చెక్కు అందజేత

**చిగురుమామిడి, విశాల భారతి:** కార్యకర్తలు ఎవరు అధైర్యపడొద్దని, కార్యకర్తలకు అండగా బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ఉంటుందని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ అన్నారు. హుస్నాబాద్ లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త బొయిని వెంకటయ్య ప్రమాదవశాత్తూ మృతిచెందగా బిఆర్ఎస్ పార్టీ.. పార్టీ సభ్యత్వ ప్రమాద బీమా ద్వారా మంజూరైన 2లక్షల విలువైన చెక్కును నామినీగా ఉన్న కుమారుడు చిగురుమామిడి మండల బిఆర్ఎస్ వి మండలం అధ్యక్షులు బోయిని మనోజ్ కు చెక్కును మాజీ శాసన సభ్యులు వొడితల సతీష్ కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.



## దళిత మైనర్ బాలుడిని కొట్టిన మధుసూదన్ రెడ్డిని అరెస్టు చేయాలి

**షాబాద్ విశాల భారతి** దళిత మైనర్ బాలుడిని కొట్టిన మధుసూదన్ రెడ్డినీ అరెస్టు చేసి శిక్షించాలని బీసీ సేవ జాతీయ అధ్యక్షులు ఖర్క కృష్ణయాదవ్, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాక్షులు బేగరి రాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. మంగళవారం షాబాద్ మండల కేంద్రంలో ముంబాయి బెంగుళూరు లింగ్ జాతీయ రహదారిపై అంబేడ్కర్ వాదులు, యువజన సంఘాల ఆధ్వర్యంలో దర్నా రాస్తారోకో నిర్వహించారు. అరగంట పాటు వాహనాలు రోడ్డుపై నిలిచిపోవడంతో ట్రాఫిక్కు అంతరాయం జరిగింది. షాబాద్ సీఐ కాంతారెడ్డి ఎస్ఐ మహేశ్వర్రెడ్డి వారిని సంజయించి వారి ధర్నాను విరమింపజేసి నిందితున్ని వెంటనే అరెస్టు చేసి రిమాండ్కు తరలిస్తామని హామీ ఇచ్చారు. షాబాద్ మండల పరిధిలోని కేసారం గ్రామానికి చెందిన జీగరి రాములు కుమారుడైన యాదగిన పై దాడి చేసిన మధుసూదన్రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మదుసూదన్ రెడ్డి ఇంటి ఆవరణలో ఉన్న దానిమ్మ చెట్టుకు ఒక పండు తెంపుకున్నందుకు విచక్షణ రహితంగా మైనర్ బాలుణ్ణి కొట్టడం, హింసించడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చోక్కంపేట ఆంజనేయులు, ఎమ్మార్పీస్ రాష్ట్ర నాయకులు, తదితరులున్నారు.

## పల్లె పోరు ఎప్పుడో..?





**భీమదేవరపల్లి విశాల భారతి** గ్రామపంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ఇప్పటికే ముగిసిపోగా జూలై 4 తో మండల పరిషత్ జిల్లా పరిషత్ పదవి కాలం ముగియనున్నది. స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో ఆసక్తి తో ఆశావాహులు ఎదురు చూస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం స్థానిక సంస్థలకు ఎన్నిక లు ప్రభుత్వం ఇప్పటికే పూర్తి చేయాల్సిన రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం అంతలోనే పార్లమెంట్ సాధారణ ఎన్నికలు షెడ్యూల్ వెలువడడం ఈ ప్రక్రియ అంతా పూర్తి కావడానికి చాలా సమయం పట్టింది. పంచాయతీలకు జనవరిలోనే ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అలాగే మండల పరిషత్ జిల్లా పరిస్థితులకు కూడా ఇప్పటికే ఎన్నికలు నిర్వహించి ఎంపీపీ జిల్లా పరిషత్ చైర్మన్ పదవి కాలం ముగిసిపోగానే వారి స్థానంలో కొత్త ప్రజా ప్రతినిధులను నియమించి బాధ్యతను అప్పగించాల్సి ఉండే కుల గణన నిర్వహించాలని రాష్ట్రప్రభుత్వం భావించడం కార్యక్రమం ముగిసిన తర్వాత రిజర్వేషన్లలో మార్పులు చేయాలని యోచిస్తుంది. ఈ లెక్కన చూసినట్లయితే స్థానిక సంస్థలు ఎన్నికలు నిర్వహణ ఇప్పట్లో సాగే అవకాశం లేనట్టుగానే కనిపిస్తుంది. ఎంపీటీసీ జెడ్పిటిసి పదవీకాలం ముగింపు లోపు ఎన్నికలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ఆశావాహులు కోరుతున్నారు. జులై 4 తో మండల జిల్లా పరిషత్ ముగిసే వరకి ఎన్నికలు నిర్వహించకపోతే ప్రత్యేక అధికారుల నియమించే అవకాశం ఉన్నట్టుగా కనిపిస్తుంది.



## ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్

**కోదాడ, విశాలభారతి:** పట్టణంలోని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ మంగళవారం కోదాడ పట్టణంలోని ఏరియా హాస్పిటల్ ఆకస్మిక సందర్శించారు. జనరల్ వార్డ్, ఎక్స్రే రూమ్, ప్రయోగశాలను పరిశీలించారు. ప్రతిరోజు ఎన్ని నమూనాలను సేకరించి రిజిస్టర్లలో నమోదు చేస్తున్నారో కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. అక్కడ నుండి ఫార్మసీ కేంద్రాన్ని పరిశీలించి పేషెంట్లకు ఇస్తున్న మందులను పరిశీలించారు. మందుల స్టాక్ వివరాలను రిజిస్టర్ ని పరిశీలించారు. ఎన్ని రకాల వ్యాక్సిన్స్ అందుబాటులో ఉన్నాయో కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. అందుబాటులో ఉన్న వ్యాక్సిన్స్ వివరాలను సేకరించారు. డయాలసిస్ యూనిట్ ను పరిశీలించి రోజుకు ఎంతమంది పేషెంట్లకు డయాలసిస్ చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ప్రసూతి వార్డును పరిశీలించి తొగర్రాయి గ్రామం నుండి వచ్చిన కొండపల్లి దీపిక ను, గొండ్రియాల గ్రామం నుండి డెలివరీ కి వచ్చిన మాగీ మేరీ ని ప్రసూతి సమయంలో అందించిన వైద్య సేవల గురించి వారిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్ సిబ్బంది అందరూ మమ్ములను చాలా మంచిగా చూసుకున్నారని వారు కలెక్టర్ కు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ దశరథ్, మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని ప్రమీల రమేష్, ఆర్డిఓ సూర్యనారాయణ, తాసిల్దార్ సాయి గౌడ్, స్టాఫ్ నర్సులు జ్యోతి, ప్రసన్న, లక్ష్మి అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## మహిళ మెడలోని పుస్తెలతాడు అపహరణ

**నూతనకల్, విశాలభారతి:** నిద్రిస్తున్న మహిళల మెడలోని బంగారుపుస్తెలతాడు చోరీ జరిగిన ఘటన నూతనకల్ మండలం ఎరపహాడ్ గ్రామంలో చోటుచేసుకుంది. బాధితురాలు కోంఢ్ర శోభ తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం రాత్రి ఎర్రపాడు గ్రామాలో తన భర్తతో కలిసి తన ఇంటి వరండాలో నిద్రిస్తుండగా అర్ధ రాత్రి సుమారు 02.00 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఇంటిలోకి ప్రవేశించి శోభ మెడలో ఉన్న సుమారు మూడున్నర తులాల బంగారు పూస్తేల త్రాడు ను దొంగిలించుకొని పోయినారు అని తెలియజేశారు. బాధితురాలు కొండ్ర శోభ నూతనకల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా.ఎస్. ఐ. .సైదులు కేసు నమోదు పరిచి దర్యాప్తు చేస్తున్నట్లుగా పోలీసు వారు తెలియజేశారు.



## మానవత్వం చాటుకున్న మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్

- ఆపదలో ఆదుకునే ఆపన్న హస్తుడు

**మరిపెడ, విశాల భారతి**: కోట్యా తండా గ్రామ పంచాయతీలోని జాల్ తండాలో నిన్న జరిగిన కరెంటు షార్ట్ సర్క్యూట్ తో పూర్తిగా కాలిపోయిన ఇంటిని పరిశీలించి వారి కుటుంబానికి మనోధైర్యాన్నిస్తూ ఆర్థిక సహాయం చేశారు. రెవెన్యూ డిపార్ట్మెంట్ తాహసీల్దార్ తో మాట్లాడి తక్షణమే ఆ కుటుంబానికి సహాయ సహకారాలు అందించే విధంగా చూడాలి అని చెప్పారు. ఇప్పుడున్న సమాజంలో ఆపదలో ఉన్న వారిని వచ్చి పలకరించడమే మరిచిపోయిన తరుణంలో,సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూప్ లలో పెట్టిన పోస్టులను చూసి నేను ఉన్నానంటూ వచ్చి వారి కుటుంబానికి మనోధైర్యాన్నిచ్చి మానవత్వాన్ని చాటుకున్నారు.

## మేడిపల్లిలో కోడి పందాల స్థావరంపై దాడి

- 11 మంది అరెస్ట్

**మేడిపల్లి,విశాలభారతి:** కోడిపందాల స్థావరం పై దాడి చేసి పలువురిని అదుపులోకి తీసుకున్న సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ ఓ టి, మేడిపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విశ్వసనీయ సమాచారం మేరకు మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ సత్య నారాయణపురం కాలనిలో కోడిపందెలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎస్ ఓ టి, మేడిపల్లి పోలీసులు సంయుక్తంగా స్థావరం పై దాడి నిర్వహించి కోడిపందాలు ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకుని వారి నుండి 3 ఫైటింగ్ కుక్స్, 22 కోడి కత్తులు, రూ.



39,600 నగదు స్వాధీనం చేసుకుని వారిని స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేశారు.

## అనుమానితుల పట్ల అప్రమత్తత అవసరం

- ఎస్.ఐ సైదాబాబు
- మహిళల మెడలో బంగారమే లక్ష్యంగా దొంగతనాలు
- గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి
- ప్రజలకు పలు సూచనలు చేసిన ఎస్ఐ




**చిట్యాల,విశాలభారతి:** అనుమానిత వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చిట్యాల ఎస్ఐ సైదాబాబు తెలిపారు. గత కొద్ది రోజులుగా మండల కేంద్రం మరియు చుట్టుపక్కల గ్రామాలలో వరుస దొంగతనాలు జరుగుతున్నాయని ముఖ్యంగా చిట్యాల పట్టణంలోని 10వ వార్డులో ఆరు బయట నిద్రిస్తున్న మహిళ మెడలోనుండి 4తులాల బంగారు గొలుసు ని ఇద్దరు దొంగలు గుంజుకొని వెళ్లారు.ఆదివారం రోజు పిశాటిగూడెం గ్రామం కి చెందిన పిశాటి సుగుణమ్మ తన నివాసం లో మంచం మీద పడుకొని ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు నలుగురు ఇంట్లో కి వచ్చి సుగుణమ్మ మెడలో ఉన్న సుమారు మూడు తులాల బంగారం పూస్తేల తాడు ను దొంగిలించారు. భాదితుల పిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నాం. ప్రజల నిర్లక్ష్యం వల్లనే చోరీలు జరుగుతున్నాయని మా ప్రాథమిక నిర్ధారణలో వెల్లడైందని ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని ప్రజలు ఇంట్లో విలువైన వస్తువులు ఉన్నప్పుడు, ఎక్కడికైనా ప్రయాణాలకు వెళ్ళేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.మీమీ గ్రామాలలో గల సీసీ కెమెరాలు పనిచేయకపోతే వెంటనే వాటిని రిపేరు చేయించుకొని పనిచేసేలా చూడాలని అందుకు గ్రామ ప్రజలందరూ కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. అలాగే మీ ప్రాంతాలలో అనుమానిత వ్యక్తులు కనబడితే వెంటనే డయల్ 100 కి గాని చిట్యాల పోలీస్ స్టేషన్ ఎస్.ఐ 8712670187 నంబర్ కి గాని సమాచారం ఇవ్వాలని కోరారు.



## ఘనంగా రఘువీరా రెడ్డి జన్మదిన వేడుకలు

- జన్మదినోత్సవ సందర్భంగా రక్తదానం

**డోర్నకల్, విశాలభారతి:** కాంగ్రెస్ పార్టీ మరిపెడ మండల అధ్యక్షుడు రఘువీర్ రెడ్డి జన్మదిన వేడుకలను ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు వివిధ గ్రామాల నుండి తరలి వచ్చి కేక్ కట్ చేసి సాల్వలతో సత్కరించి మిఠాయిలు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రఘు వీర్ రెడ్డి జన్మదిన సందర్భంగా 50 మంది కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు రక్తదానం చేశారు.స్వయంగా జన్మదినోత్సవం జరుపుకుంటున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రఘువీరారెడ్డి కూడా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ రవి నాయక్,కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లు శ్రీకాంత్ రెడ్డి,తేజావత్ నెహ్రు నాయక్,విజయ్ నాయక్,వీరాభద్రం, సాయి,శ్రీను నాయక్,సిరాజ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## క్రీడలను ప్రోత్సహిస్తాం, క్రీడాకారులకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే శ్రీ గణేష్

**విశాలభారతి, కంటోన్మెంట్ :** హైదరాబాద్ డిస్టిక్ యూత్ అండ్ స్పోర్ట్స్ అధికారి ఎం సుధాకర్ రావు ఆధ్వర్యంలో జింఖానా గ్రౌండ్ కోచులు, క్రీడాకారులు, క్రీడాకారుల తల్లిదండ్రులు కంటోన్మెంట్ శాసనసభ్యులు శ్రీ గణేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. జింఖానా మైదానం సౌకర్యాలు,అభివృద్ధి, క్రీడాకారులకి అన్ని విధాల సహకారం అంది ఇవ్వాలని కోరగా, ఎమ్మెల్యే మాట్లాడుతూ నా సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. అథ్లెటిక్స్ విభాగంలో రాష్ట్రస్థాయి జాతీయ స్థాయి గెలిచిన క్రీడాకారులను ఎమ్మెల్యే అభినందించి, మెడల్స్, ధ్రువపత్రాలను అందజేశారు..ఈ క్రమంలో క్రీడాకారులు క్రీడాకారుల తల్లిదండ్రులు స్థానికులు పాల్గొన్నారు.

## బాధితుడికి ఫోన్ అప్పగించిన ఎస్సై విక్రమ్

**ధర్పల్లి, విశాల భారతి:** దర్పల్లి గ్రామానికి చెందిన కాసుల సాయిలు గత 15 రోజుల కిందట తన ఫోన్ పోయిందని ధర్పల్లి పోలీస్ స్టేషన్లో దరఖాస్తు ఇవ్వగా సి.ఇ.ఐ.ఆర్ (CEIR) పోర్టల్ ద్వారా వెతికి బాధితుడికి సెల్ ఫోన్ అప్పగించామని ధర్పల్లి ఎస్సై విక్రమ్ తెలిపారు.



# ఆగి ఉన్న ట్యాంకర్ ను ఢీకొన్న డీసీఎం వాహనం

- బీహార్ చెందిన ఇద్దరు కూలీలు అక్కడికక్కడే మృతి
- డ్రైవర్ కు తీవ్ర గాయాలు



**పటాన్ చెరు,విశాలభారతి:**పటాన్ చెరు సమీపంలోని ముత్తంగి ఓఅర్అర్ రింగ్ రోడ్ పై జరిగిన రోడ్డు ప్రమాదంలో బీహార్ చెందిన ఇద్దరు కూలీలు అక్కడికక్కడే మృతిచెందగా, డ్రైవర్ తీవ్ర గాయాలతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం ముత్తంగి జంక్షన్ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున ఆగి ఉన్న సిమెంట్ ట్యాంకర్ ను మేడ్చల్ నుంచి పటాన్ చెరు వైపునకు వస్తున్న ఐచర్ డీసీఎం వాహనం ఢీ కొట్టింది. ఐచర్ వాహనం క్యాబిన్ లో ఉన్న బీహార్ కు చెందిన ఇద్దరు కూలీలు అక్కడికక్కడే మృతి చెందగా, డ్రైవర్ సాయికు తీవ్ర గాయాలు అయ్యాయి. ఐచర్ వాహనం మేడ్చల్ లో కోళ్లు లోడ్ ఖాళీ చేసి పటాన్ చెరు వైపు వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. గాయపడిన డీసీఎం డ్రైవర్ సాయి రామ్ ను, చనిపోయిన ఇద్దరు కూలీల హృదయహాలను పటాన్ చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ నిద్ర మత్తు కారణమని పోలీసులు భావిస్తున్నారు.





- కల్తీ చేస్తే కఠినచర్యలు
- చిట్కుల్ తెలంగాణ సంఘీక సంక్షేమ బాలికాల వసతి గృహం, పలు ప్రైవేటు హాస్టల్లో తనిఖీ చేసిన ఎఫ్ఎస్ఎస్ఏఐ, ఫుడ్ సేఫ్టీ అండ్ వీల్స్ బృందం

# ఆహార భద్రతపై నిర్లక్ష్యం వద్దు

**పటాన్ చెరు,విశాలభారతి:**ఆహార భద్రతపై నిర్లక్ష్యం వద్దని, కల్తీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎఫ్ఎస్ఎస్ ఏఐ, ఫుడ్ సేఫ్టీ అండ్ వీల్స్ బృందం వ్యాపారస్తులను హెచ్చరించింది. ఆరోగ్య శాఖ మంత్రి, కమీషనర్ ఫుడ్ సేఫ్టీ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని చిట్కుల్ లో గల తెలంగాణ సంఘీక సంక్షేమ బాలికాల వసతి గృహం,పలు ప్రైవేటు హాస్టల్లో ఈ బృందం తనిఖీ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాసిరకం ఆహార పదర్ధాలను, గడువు ముగిసిన ఆహార పదార్థాల ను ప్రజలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, ఇతర ఆహార వ్యాపారుస్తులను హెచ్చరించారు చిట్కుల్ గ్రామం లో గల తెలంగాణ సంఘీక సంక్షేమ బాలికాల వసతి గృహంలో తనికీలు నిర్వహించగా మురమరాలు, ఎండు కొబ్బరిలో తయారీ తేదీ లేకపోవటం, గసగసాలు లో బ్లాక్ బ్యాగ్స్(లక పురుగులు) వుండటం, వంటగది ప్రాంగణంలో ఈగలు వుండటం, సరియైన నియంత్రణ, నిర్వహణ లేకపోవటం, ఫుడ్ హ్యాండ్లర్లకు మెడికల్ రికార్డు లేకపోవడం, ఫుడ్ హ్యాండ్లర్లకు తలపాగాలు(హెడ్ క్యాప్స్) అప్రాన్లు లేకపోవటం, ఆహార నిర్వాహకులు పరిశుభ్రత శిక్షణ లేకపోవటం, అపరిశుబ్రమైన నిలువ పాత్రలు, ముడి పదార్థాల కంటైనర్ వుండటం, త్రాగునీటి పిఎచ్ పరిమితికి తగ్గి ఉండటం వారి దృష్టికి వచ్చింది. అలాగే శ్రీరామ్ లగ్జరీ పురుషుల ప్రైవేట్ హాస్టలను తనికీలు నిర్వహించగా ఎఫ్బిఓకి ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ లేకపోవటం, డస్ట్ బిన్లు తెరవబడి వుండటం, సరైన వంట గది/తయారి ప్రాంతం లేకపోవటం, నీరు నిలువ వుండే టంకు దుమ్ము తుప్పు పట్టి వుండటం, కురగాయలు నాసిరకంగా వుండటం, లేబుల్ లేని అశోక కస్తూరి మేతి, ప్రియం కరేరి మేతి మరియు రూ. 700/ విలువయిన జీడిపప్పు స్వాదీనం చేసుకున్నట్లు చెప్పారు. త్రాగునీటి పిహెచ్ పరిమితికి తగ్గి వుండటం గమనించారు, రిఫ్రిజిరేటర్ పనిచేయకుండా వుండటం, ఫుడ్ హ్యాండ్లర్స్ లకు మెడికల్ సర్టిఫికేషన్ లేకుండా వుండటం వంటివి వారి దృష్టికి వచ్చింది. వ్యాపారస్తులు నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.



# ఘనంగా ప్రొఫెసర్ డా" శ్రీరాములు జన్మదిన వేడుకలు



**హైదరాబాద్, విశాలభారతి:** ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డా" శ్రీరాములు జన్మదిన వేడుకలను క్యాంపస్ లో అధ్యాపకులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. పలువురు అధ్యాపకులు విద్యా రంగంలో అయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ప్లాంటేషన్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా పెద్ద సంఖ్యలో మొక్కలు నాటారు. ఈ వేడుకల్లో ప్రొఫెసర్ డి శ్రీరాములు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్, పి మేనేజ్మెంట్ ఫ్యాకల్టీ డీన్ వెంకటలహ, మేనేజ్మెంట్ ఫ్యాకల్టీ డీన్ ప్రొ.ఎం.గంగాధర్, బిజినెస్ మేనేజ్మెంట్ విభాగం హెడ్ ప్రొ.వి.సుధ, డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ హెడ్ ప్రొ.డి.చెన్నప్ప రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ వై. జహంగీర్, ప్రొఫెసర్ కవితా దేవి, ప్రొఫెసర్ ఎ ప్యాట్రిక్, డా.క డా.జి.విద్యాసాగర్ రావు, డా.జి.శ్రీనివాస్ రావు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





# ఔటర్ రింగ్ రోడ్డుపై గ్యాస్ సిలిండర్లతో వెళుతున్న డీసీఎం బోల్తా

**కీసర,విశాలభారతి:** కీసర ఔటర్ రింగు రోడ్డు పై భారత్ గ్యాస్ సిలిండర్ రోడ్డుతో వెళ్తున్న డీసీఎం మంగళవారం బోల్తా పడింది.వివరాల్లోకి వెళ్తే డీసీఎం టైర్ పంచర్ అయి ఒక్కసారిగా లోడ్ తో ఉన్న డీసీఎం పల్టి కొట్టింది.ఘట్కేసర్ నుండి ఇండస్ట్రీస్ ఐడియా బొల్లారంకు వెళ్తున్న డీసీఎం TS 08 UB 4445.డీసీఎంలో ఉన్న ఇద్దరు వ్యక్తులు డ్రైవర్ శ్రీనివాస్ గౌడ్ మరియు మరో వ్యక్తి కి స్వల్ప గాయాలు అయ్యాయి.డీసీఎం వెనకాల వాహనాలు లేకపోవడంతో తప్పిన పెను ప్రమాదం.అనంతరం ఔటర్ రింగ్ రోడ్డు ట్రాఫిక్ పోలీసులు రోడ్డు క్లియర్ చేయడం జరిగింది.



# గోవిందరెడ్డిని కలిసిన ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం

**మేడిపల్లి,విశాలభారతి:**మేడిపల్లి మండల ప్రింట్ మీడియా (టి యు డబ్ల్యూ జే హెచ్ 143) నూతన కార్యవర్గం ఎన్నుకోబడిన సందర్భంగా అధ్యక్షుడు ఆధ్వర్యంలో మేడిపల్లి ఇన్స్పెక్టర్ గోవిందరెడ్డి, బోడుప్పల్ మున్సిపల్ కమిషనర్ రాజలింగం నీ ,కలిసి కార్యవర్గాన్ని పరిచయం చేసి కమిటీ పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గొడిశాల సోమయ్య గౌడ్ ,ప్రధాన కార్యదర్శి కొండపర్తి నాగభూషణాచారి, ఉపాధ్యక్షులు బండ నరసింహ, కోశాధికారి జిఎం కిషోర్, సంయుక్త కార్యదర్శి రాజపేట నవీన్ చారి, బండారి శ్రీధర్, కార్యవర్గ సభ్యులు, మల్లేష్ గౌడ్, రఘు, ప్రకాష్, బుచ్చిరెడ్డి,పాల్గొన్నారు.




# అండర్ పాస్ వద్దు.. ఫ్లై ఓవర్ నిర్మాణమే చేపట్టాలి

- సామా రంగారెడ్డి

**ఎల్బీనగర్ విశాలభారతి:**హైదరాబాద్ - విజయవాడ జారీయ రహదారి అభివృద్ధిలో భాగంగా ప్రజలకు ఇబ్బందులు కలిగే పనులు రోడ్లు భవనాల శాఖ అధికారులు చేపట్టొద్దని మంగళవారం కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎల్బీనగర్ భారతీయ జనతా పార్టీ నేతలు, వివిధ కాలనీల సంక్షేమ సంఘాల నాయకులతో పనామ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేసి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సామా రంగారెడ్డి మాట్లాడుతూ... దుర్గా విలాస్ మెస్ నుండి ఆటోనగర్ వరకు నిర్మించే అండర్ పాస్ రోడ్డుకు ఇరువైపులా ఎత్తయిన ప్రహరీ వలన ప్రజల రాకపోకలకు, రోడ్డుకు ఇరువైపులా ఉన్న కమర్షియల్ షెటర్లలో ఉన్న వ్యాపారాలకు అంతరాయం కలుగుతుందని ఆందోళవ్యక్తం చేశారు. ఈ అండర పాస్ నిర్మాణం వలన మన్సూరా నీలకు కనెక్టివిటీ రోడ్డు లేక ప్రయాణాలకు ప్రజలు ఇబ్బందులు పడతారని, సుష్మ చౌరస్తా వద్దు పిల్లర్లతో కూడినటువంటి ఫ్లై ఓవర్ నిర్మించాలని, అండర్ పాస్ నిర్మాణం చేపట్టొద్దని ప్రజలకు అనుగుణంగా ఉండే పనులు చేపట్టాలని నేషనల్ హైవే రోడ్డు అభివృద్ధి పనులను తక్షణమే రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు. ప్రజలను ఇబ్బందులు కలుగజేసే పనులు చేపడితే ఉపేక్షించేది లేదని పూర్తి వివరాలు మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ దృష్టికి తీసుకెళ్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పని చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్త రవీందర్ గౌడ్, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహ్మా రెడ్డి, కళ్లెం నవజీవన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ అంజన్ కుమార్ గౌడ్ , తడకమళ్ళ విజయ్ కుమార్, నాంపల్లి రామేశ్వర్, పాల్గొన్నారు.





# ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ చేసిన మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

**నాగారం,మున్సిపాలిటీ:**మంగళవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ఎస్ సి కమ్యూనిటీ హల్ లో జరిగిన కుట్టు మిషన్ల పంపిణి కార్యక్రామనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి.ఈ సంధర్బంగా మల్లారెడ్డి మాట్లాడుతూ మహిళాలు స్వశక్తి తో ఆర్ధికంగా ఎదగాలని అలాగే ఎస్ సి కార్పొరేషన్ మరియు ప్రో ఫ్యాషన్ అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాగారం మున్సిపాలిటీ కి చెందిన 70 మంది మహిళాలకు దాదాపు 3 నెలలు ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ ఇచ్చి ఉచితంగా కుట్టుమిషన్ లను పంపిణి చేయడం జరిగింది అని అన్నారు. ఇప్పుడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు ఇంకా కేంద్రం నుండి ముద్ర లోన్ లు తీసుకొని మరి స్వయంగా చిన్న చిన్న పరిశ్రమలు పెట్టుకొని వ్యాపారాల్లో రాణించాలి అని అన్నారు.అనంతరం మహిళలకు కుట్టు మిషన్లు,సర్టిఫికెట్లు మల్లారెడ్డి అందజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ చంద్ర రెడ్డి,వైస్ చైర్మన్ మల్లేష్,మున్సిపాలిటీ కమిషనర్,కౌన్సిలర్లు,కో అప్షన్ సభ్యులు,మున్సిపాలిటీ బి అర్ ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీధర్, నాయకులు, ఎస్ సి కార్పొరేషన్ అధికారులు,అభయ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# గంజాయితో దొరికిన యువకులకు రిమాండ్

**మేడిపల్లి,విశాలభారతి:**గంజాయి కేసులో దొరికిన నలుగురు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్టు మేడిపల్లి ఇన్స్పెక్టర్ గోవిందరెడ్డి తెలిపారు.. ఇన్స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బోడుప్పల్ ఏరియాలో సోమవారం వాహన తనిఖీలు చేస్తుండగా రెండు ద్విచక్ర వాహనాలపై కూరెళ్ల సాయికుమార్, శివరాత్రి వినయ్ కుమార్, కోడిదల మనోజ్, సంతోష్ కుమార్ అనే నలుగురు యువకులు అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించారు.. వెంటనే వారిని ఆపి వాహనాలను తనిఖీ చేయగా వారి వద్ద ఉన్న బ్యాగులలో సుమారుగా 1100 గ్రాముల గంజాయి లభ్యమైంది.. ఈ మేరకు ఆ నలుగురిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు.. వారి వద్ద ఉన్న రెండు ద్విచక్ర వాహనాలతో పాటు ఆరు సెల్ ఫోన్ లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.. విచారణ జరిపిన అనంతరం వారిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్టు ఇన్స్పెక్టర్ గోవిందరెడ్డి తెలిపారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు, గంజాయికి దూరంగా ఉండాలని సూచించారు.. మత్తు పదార్థాల వినియోగించడం ద్వారా ఎంతోమంది యువకుల జీవితాలు దుర్భరమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.. ఎంతటి వారైనా తప్పు చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.. తమ పరిధిలో గంజాయి, మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపుతామని ఇన్స్పెక్టర్ తెలిపారు.. యువత తప్పుదారిలో ప్రయాణించకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని అన్నారు ఇన్స్పెక్టర్ గోవిందరెడ్డి.. నిందితులను పట్టుకోవడంలో సహకరించిన సిబ్బందిని ఆయన అభినందించారు..



## తిమ్మయిపల్లీలో డీజిల్ ట్యాంకర్ బోల్తా

# డ్రైవర్ కి సల్ప గాయాలు



**కీసర,విశాలభారతి :** మంగళవారం తిమ్మాయిపల్లి గ్రామంలో డ్రైవర్ నిర్లక్ష్యంతో డీజిల్ ట్యాంకర్ బోల్తా పడింది.ట్యంకర్ లారీలో డీజిల్ పెట్రోల్ తో నిండి ఉండడంతో ఒక్కసారిగా భయభ్రాంతులకు గురైన వాహనదారులు చుట్టూ పక్కల ప్రజలు.విషయం తెలుసుకున్న పోలీసులు సకాలంలో స్పందించి కీసర నుండి షామీర్ పెట్ వైపు వెళ్లే ప్రధాన రహదారిని కాసేపు మూసి వాహనాలను దారి మళ్ళించారు.సంఘటన స్థలానికి సమయానికి వచ్చిన ఫైర్ ఇంజన్.ట్యాంకర్ లో మొత్తం కెపాసిటీ 12,000 లీటర్లు అందులో మొత్తం మూడు కంపార్ట్మెంట్లు ఉండగా రెండు కంపార్ట్మెంట్లలో 8000 లీటర్ల డీజిల్ ఉంది మరొ ఒక్క కంపార్ట్మెంట్ లో 4000 లీటర్ల పెట్రోల్ తో నిండి ట్యాంకర్ ఉండడంతో అప్రమత్తమైన పోలీసులు.ట్యాంకర్ డ్రైవర్ నర్సింహ కు స్వల్ప గాయాలు అనంతరం డ్రైవర్ ను హాస్పటల్ కి తరలించిన పోలీసులు.



## బోగారంలో మహిళా గ్రామ సభలో

# పాల్గొన్న ఎంపిటిసి వెంకట్ రెడ్డి

**కీసర,విశాలభారతి :**బోగారం గ్రామంలో మహిళ శక్తి గ్రామ సభ మంగళవారం జరిగింది.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బోగారం ఎంపిటిసి సింగిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ మహిళలకు డ్వాక్రా సంఘాల ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులని కేటాయిస్తున్నారు అని అన్నారు.కావున మహిళలు స్వతహాగా అభివృద్ధి చెందాలని అన్నారు.రాబోయే రోజుల్లో మహిళలకు మీసేవ కేంద్రాలు భోజనం క్యాంటీన్లు,చేపల వ్యాపారం మరియు బర్రెలు ఆవులు అందజేయనున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీసీ సుదర్శన్ రెడ్డి,గ్రామ కార్యదర్శి శ్రీరామ్ మహిళా సంఘల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



# మేడిపల్లి సీఐ గోవిందా రెడ్డికి అరుదైన గౌరవం

- రాష్ట్ర ప్రభుత్వం నుండి సేవ పథకం పొందిన మేడిపల్లి ఇన్స్పెక్టర్
- అభినందించిన రాచకొండ కమిషనర్ తరుణ్ జోషి ఐపీఎస్

**మేడిపల్లి,విశాలభారతి:**విధుల్లో ఉత్తమ సేవలు అందించినందుకు గాను మేడిపల్లి సిఐ కి అరుదైన గౌరవమైనా సేవా పథకం ప్రభుత్వం ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. గోవిందరెడ్డి స్వస్థలం నల్గొండ జిల్లా, కోదాడ, ప్రస్తుతం మేడిపల్లి పోలీస్ స్టేషన్లో ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ మధ్యకాలంలో పసిపిల్లల విక్రయ ముఠాను అరెస్టు చేసి ఎంతోమంది పసిపిల్లలను కాపాడారు. నకిలీ బంగారు విక్రయ దొంగలను చాకచక్యంగా పట్టుకొని కటకటాల పాలు చేశారు. అనేక హత్య కేసులు చేదించి అధికార మన్నలలు పొందారు. ఇప్పటివరకు ఆయనకు 180 గుడ్ సర్వీస్ ఎంట్రీలు, మెరిట్రియస్ సర్వీస్ సెంటర్లు, 6 ఆపరేషన్ రివార్డులు అందుకున్నారు. ఇందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం చే సేవా పథకం పొందిన మేడిపల్లి ఇన్స్పెక్టర్ గోవిందరెడ్డిని కమిషనర్ తరుణ్ జోషి ఐపీఎస్ అభినందించారు.


# భారతీయుడు 2' ట్రైలర్



యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్, సెన్సేషనల్ డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో అగ్ర నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ తో పాటు ప్రముఖ నిర్మాణ సంస్థ రెడ్ జెయింట్ బ్యానర్ పై సుభాస్కరన్ నిర్మించిన భారీ బడ్జెట్ చిత్రం 'భారతీయుడు 2'. జీరో టాలరెన్స్ ట్యాగ్ లైన్. 'భారతీయుడు 2' మూవీ తెలుగు థియేట్రికల్ హక్కులను ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్మెంట్స్ ఎల్ఎల్‌పి, సీడెడ్ హక్కులను శ్రీలక్ష్మి మూవీస్ సంస్థలు దక్కించుకున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో జూలై 12న ఈ చిత్రం గ్రాండ్ లెవల్లో రిలీజ్ కానుంది. చిత్ర యూనిట్ ప్రమోషనల్ ప్లానింగ్ తో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ క్రమంలో 'భారతీయుడు 2' ట్రైలర్‌ను తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల చేశారు.. ట్రైలర్‌ను గమనిస్తే... 'ఊరారా ఇది.. చదువుకు తగ్గ జాబ్ లేదు.. జాబ్‌కు తగ్గ జీతం లేదు..కట్టిన ట్యాక్స్ తగ్గినట్లు సౌకర్యాలు లేవు..దొంగలించేవాడు దొంగలిస్తూనే ఉన్నాడు, తప్పు చేస్తున్నవాడు తప్పు చేస్తూనే ఉంటాడు'' అని ఓ మహిళ తన ఆవేదనను వ్యక్తం చేస్తుంది. మరో వైపు హీరో సిద్ధార్థ్ 'మనం ఒక్కొక్కరినీ తప్పు పడుతూనే ఉంటాం. సిస్టమ్ సరిగా లేదు. సరి చేయాలని నోటికొచ్చినట్లు మాట్లాడుతుంటాం. కానీ దాన్ని సరి చేయటానికి కొంచెం కూడా ప్రయత్నించటం లేదు' తన బాధను వ్యక్తం చేస్తాడు. 'భారతీయుడు 2' ట్రైలర్‌లో సేనాపతి పాత్రతో పాటు డిఫరెంట్ లుక్స్‌లో కమల్ హాసన్ తనదైన అభినయాన్ని ప్రదర్శించారు. ఇక మర్మకళతో విలన్స్ భరతం పట్టడాన్ని కూడా ఈ సినిమాలో మరింత విస్తృతంగా చూపించినట్లు స్పష్టమవుతుంది. రవివర్మన్ సినిమాటోగ్రఫీ, అనిరుద్ సంగీతం, నేపథ్య సంగీతం సన్నివేశాలను మరో లెవల్‌లో ఆవిష్కరించాయి. దీంతో సేనాపతిగా మరోసారి కమల్ హాసన్ బాక్సాఫీస్ రికార్డులను తిరగరాయబోతున్నారంటూ ట్రైలర్ చూస్తుంటేనే అర్థమవుతుంది. కమల్ హాసన్ టైటిల్ పాత్రలో నటిస్తోన్న ఈ చిత్రంలో సిద్ధార్థ్, కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్ సింగ్, ప్రియా భవానీ శంకర్, ఎస్.జె.సూర్య, బాబీ సింహ తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. రవివర్మన్ సినిమాటోగ్రఫీ అందిస్తోన్న ఈ చిత్రానికి అనిరుద్ రవిచంద్రన్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఎ.శ్రీకర ప్రసాద్ ఎడిటర్, ప్రొడక్షన్ డిజైనర్‌గా టి.ముత్తురాజ్ గా వర్క్ చేస్తున్నారు. బి.జయమోహన్, కబిలన్ వైరముత్తు, లక్ష్మీ శరవణకుమార్‌లతో కలిసి డైరెక్టర్ శంకర్ స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. ఈ కలయిక ప్రేక్షకులకు తిరుగులేని సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందిస్తుందనటంలో సందేహం లేదని ట్రైలర్‌తో స్పష్టమైంది.

# పారిస్ కోచర్ వీక్‌లో మెరిసిన జాన్వీ

అందాల తార శ్రీదేవి తనయగా బాలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన జాన్వీ కపూర్ తనకంటూ ప్రత్యేక ఇమేజ్ సంపాదించుకుంది . ధడక్ సినిమాతో సిల్వర్ స్క్రీన్‌పై మెరిసిన ఈ బ్యూటీ హిందీతోపాటు తెలుగులో కూడా తన అభిమానులను పెంచుకుంది. తరచు సోషల్ మీడియాలో ఉండే జాన్వీకపూర్ మంగళవారం పారిస్ కోచర్ వీక్‌లో సందడి చేసింది. శక్తులు, సౌరభాలను చాలా అందంగా నిక్షిప్తం చేసిన మీ అద్భుతమైన ప్రదర్శనలో నన్ను కూడా భాగం చేసినందుకు రాహుల్ మిశ్ర ధన్యవాదాలు. పారిస్ కోచర్ వీక్‌లో ర్యాంప్‌పై హొయలుపోతూ దిగిన స్టిల్స్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. ఈ ఫొటోలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. అందమైన హనీమూన్ షూట్‌లో ధగ ధగ మెరిసిపోతూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచింది. ప్రస్తుతం జాన్వీకపూర్ గ్లోబల్ స్టార్ జూనియర్ ఎన్టీఆర్ నటిస్తోన్న దేవర సినిమాలో హీరోయిన్‌గా నటిస్తోంది. అలాగే బుచ్చిబాబు సాన, రాంచరణ్ కాంబోలో వస్తున్న ఆర్‌సీ 16లో కూడా హీరోయిన్‌గా నటిస్తోంది.





# అల్లు శిరీష్ "బడ్డీ" ట్రైలర్ లాంఛ్



అల్లు శిరీష్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ "బడ్డీ". గాయత్రి భరద్వాజ్, ప్రిషా రాజేశ్ సింగ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని స్టూడియో గ్రీన్ ఫిలింస్ బ్యానర్ పై కేఈ జ్ఞానవేల్ రాజా, అధన జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. శామ్ ఆంటోన్ దర్శకత్వం వహిస్తున్నారు. నేహ జ్ఞానవేల్ రాజా కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. యూత్ ఫుల్ లవ్ ఎంటర్ టైనర్ గా ఈ సినిమా తెరకెక్కింది. జూలై 26న "బడ్డీ" సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ కార్యక్రమాన్ని హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా మాట్లాడుతూ హైదరాబాద్ లోని మీడియా మిత్రులను, తెలుగు ఆడియెన్స్ ను, ఇక్కడి మంచి ఫుడ్ ను మిస్ అవుతుంటాను. మీరంతా ఎన్నో ఏళ్లుగా మా స్టూడియో గ్రీన్ సంస్థను ఆదరిస్తున్నారు. గీతా ఆర్ట్స్, స్టూడియో గ్రీన్ కలిసి శామ్ ఆంటోన్ దర్శకత్వంలో ప్రేమకథా చిత్రమ్ సినిమాను తమిళంలో రీమేక్ చేశాం. ఆ సినిమాలో జీవీ ప్రకాష్ ను హీరోగా ఇంట్రడ్యూస్ చేశాం. సంక్రాంతికి రిలీజైన ఆ సినిమా తమిళంలో మంచి హిట్ అయ్యింది. ఇప్పుడు బడ్డీ మూవీ చేస్తున్నాం. ఈ చిత్రంలో అలీ, అజ్మల్ బాగా సపోర్ట్ చేశారు. శామ్ బడ్డీతో మా సంస్థకు మరో మంచి సినిమా ఇస్తున్నాడు. నేను ఈ కథ కంటే శామ్ ను ఎక్కువ నమ్మాను. . అల్లు శిరీష్ మా కుటుంబ సభ్యుడు లాంటి వారు. ఆయన ఫేవరేట్ హీరో సూర్య. మా జర్నీలో గుడ్ బ్యాడ్ టైమ్స్ లో శిరీష్ సపోర్ట్ గా ఉన్నారు. ఆయన థ్యాంక్స్ చెబుతున్నా. బడ్డీ సినిమా ఫుటేజ్ కొంతమందికి చూపించాను. శిరీష్ బడ్డీలో బాగా కనిపించారు, బాగా నటించారు అని వాళ్లు చెప్పారు. మధుర శ్రీధర్ గారు మా ఆవారా సినిమా టైమ్ నుంచి పరిచయం. ఆవారా సాంగ్స్ మధుర ఆడియోలో రిలీజ్ చేశాం. అప్పటి నుంచి మమ్మల్ని ఎంకరేజ్ చేస్తూ సపోర్ట్ గా ఉన్నారు. శ్రీధర్ గారికి థ్యాంక్స్ చెబుతున్నాం. జూలై 26న బడ్డీ సినిమాను గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నాం. మీరంతా మా సినిమాను సపోర్ట్ చేసి బ్లాక్ బస్టర్ చేస్తారని కోరుకుంటున్నా. అన్నారు.

# థీమ్ ఆఫ్ కల్కి లిరికల్ వీడియో విడుదల

భారీ అంచనాల మధ్య మరో రెండు రోజుల్లో కల్కి 2898 ఏడీ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమాపై విపరీతమైన బజ్ ఏర్పడింది. దానికి తోడు... ప్రమోషన్ కంటెంట్‌తో చిత్రబృందం ఆ అంచనాల్ని ఎప్పటికప్పుడు రెట్టింపు చేస్తోంది. తాజాగా థీమ్ ఆఫ్ కల్కి లిరికల్ డియోని విడుదల చేశారు. సంతోష్ నారాయణ్ స్వర పరచిన ఈ గీతాన్ని కాలభైరవ రాగ యుక్తంగా, భావోద్వేగంగా ఆలపించారు. ఆస్కార్ విజేత చంద్రబోస్ తన అద్భుతమైన సాహిత్యాన్ని అందించారు. కల్కి 2898 ఏడీ చిత్ర సారాంశం, పాత్రల తాలుకూ నేపథ్యం, వాటి సంఘర్షణ ఇవన్నీ... చంద్రబోస్ తన సాహిత్యంలో పొందుపరిచిన విధానం శ్రోతలను అబ్బుర పరుస్తోంది. ఇటీవల ఈ పాటని మధురలో ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. శ్రీకృష్ణుడి జన్మ స్థలంలో ఈ పాట ని పరిచయం చేయడం, ఈ పాటలో కృష్ణుడి శక్తియుక్తుల్ని అక్షరాలలో మలచడం కాకతాళియం కాదు. ప్రముఖ నటి, నర్తకి శోభనా చంద్రకుమార్ ఈ పాట కోసం గజ్జె కట్టడం వీక్షకులకు మరింత హాయిని కలిగించింది. ఆ దృశ్యం కనుల పండుగలా కనిపించింది. నాగ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతీ మూవీస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించిన ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, ప్రభాస్, దీపికా పదుకొణె, దిశాపటానీ కీలక పాత్రలు పోషించిన సంగతి తెలిసిందే. ఈనెల 27న విడుదలై ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది.

## రానా దగ్గుబాటి ప్రొడ్లీ ప్రెజెంట్స్
# 35-చిన్న కథ కాదు



60 ఇయర్స్ సక్సెస్ ఫుల్ లెగసీ గల సురేష్ ప్రొడక్షన్స్, 2 ఇయర్స్ లాంగ్ గ్యాప్ తర్వాత వారి కొత్త చిత్రం క్లీన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన న్యూ ఏజ్ ఫ్యామిలీ డ్రామాతో వస్తోంది. సురేష్ ప్రొడక్షన్స్‌తో పాటు ఎస్ ఒరిజినల్స్, వాల్టెయిర్ ప్రొడక్షన్స్ బ్యానర్ లో రూపొందిన ఈ మూవీలో నివేతా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మిస్తున్న ఈ చిత్రానికి నంద కిషోర్ ఈమని రైటర్, డైరెక్టర్. ఈ మూవీకి "35 - చిన్న కథ కాదు" అనే ఆసక్తికరమైన టైటిల్ పెట్టారు. ప్లజెంట్ గా డిజైన్ చేసిన పోస్టర్ ద్వారా మేకర్స్ టైటిల్ ని రివీల్ చేశారు. గుడి మెట్లపై కూర్చున్న ఫ్యామిలీని ప్రజెంట్ చేస్తూ క్యారికేచర్‌గా దీన్ని రూపొందించారు. థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రాన్ని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్ట్ 15న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు అనౌన్స్ చేశారు. స్కూల్ ఎపిసోడ్స్ స్పెషల్ ఎట్రాక్షన్ గా క్లీన్ ఎంటర్ టైన్ మెంట్ తో అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేందుకు ఈ సినిమా సిద్ధమైంది. బ్లాక్ బస్టర్ హిట్ కొట్టడం ఖాయమని మేకర్స్ కాన్ఫిడెంట్ గా ఉన్నారు.



# శ్రియా ఏమాత్రం తగ్గట్లేదు

టాలీవుడ్ లో ఇష్టం సినిమాతో 20 ఏళ్ల క్రితం అడుగు పెట్టిన ముద్దుగుమ్మ శ్రియా శరన్. ఈ అమ్మడు టాలీవుడ్ తో పాటు కోలీవుడ్, బాలీవుడ్ చివరకు హాలీవుడ్ లో కూడా సినిమాలు చేసి మంచి గుర్తింపును సొంతం చేసుకుంది. నాలుగు పదుల వయసు కు చేరుకున్న కూడా ఈ అమ్మడి అందాల ఆరబోత తగ్గడం లేదు. పెళ్లి చేసుకుని తల్లి కూడా అయిన శ్రియా ఈ మధ్య కాలంలో వరుసగా సినిమాలు చేస్తూనే ఉంది. ఇంకా కూడా హీరోయిన్ స్థాయి సినిమాలను ఈమె చేస్తూ వస్తుంది. ఈ స్థాయి అందాల ఆరబోత చేస్తే ఎంతటి హీరోలు అయినా ఈమెతో రొమాన్స్ చేసేందుకు ఆసక్తి చూపించకుండా ఉంటారా చెప్పండి. తాజాగా మరోసారి శ్రియా సరన్ అందాల ఆరబోత ఫోటోలతో కుమ్మేసింది. క్లీ వేజ్ షో తో పాటు నడుము అందాలను చూపిస్తూ థైస్ ను ఎక్స్ ఫోజ్ చేస్తూ ఇచ్చిన ఫోటోలకు ఫోజ్ లు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ స్థాయిలో అందాల ఆరబోత చేయడం వల్ల ఈ అమ్మడు ఇంకా మోస్ట్ వాంటెడ్ అనడంలో సందేహం లేదు. హీరోయిన్ గా స్టార్ హీరోలతో నటించే అవకాశాలు రాకున్నా కూడా సీనియర్ హీరోలతో, అప్పుడప్పుడు ఐటెం సాంగ్స్ లో, ముఖ్య పాత్రల్లో నటించడం ద్వారా ఈ అమ్మడు ఇంకా బిజీ బిజీగానే ఉంది. ఆకట్టుకునే అందం తో పాటు, మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అంటూ మరోసారి ఈ ఫోటోలతో నిరూపితం అయ్యిందని ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు.



# హీరో విజయ్ దేవరకొండ "వీడీ 14" కాస్టింగ్ కాల్ అనౌన్స్

హీరో విజయ్ దేవరకొండ, డైరెక్టర్ రాహుల్ సంకృత్యన్, ప్రెస్టీజియస్ బ్యానర్ మైత్రీ మూవీ మేకర్స్ కాంబోలో క్రేజీ ప్రాజెక్ట్ వీడీ 14 ఇటీవలే అనౌన్స్ అయ్యింది. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కనుంది. నవీన్ యెర్నేని, వై రవిశంకర్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. వీడీ 14 నుంచి ఈ రోజు కాస్టింగ్ కాల్ ప్రకటన చేశారు. ఔత్సాహిక నటీనటులను ఎంపిక చేసి వీడీ 14లో నటించే అవకాశం కల్పించనున్నారు. తిరుపతి, అనంతపురం, కడప, కర్నూల్ లో జూలై 1వ తేదీ నుంచి జూలై 9వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆడిషన్స్ జరగనున్నాయి. ఈ సినిమా షూటింగ్ మొత్తం రాయలసీమలోనే జరగనుంది. నటనలో ప్రతిభ గల కొత్త టాలెంట్ కు ఇది గొప్ప అవకాశం అని చెప్పుకోవచ్చు. ఒక వీరుడి పోరాటాన్ని చూపిస్తూ 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1978 మధ్య కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా పాన్ ఇండియా ప్రాజెక్ట్ గా ఈ సినిమాను రూపొందిస్తున్నారు దర్శకుడు రాహుల్ సంకృత్యన్. 'డియర్ కామ్రేడ్', 'ఖుషి' వంటి సక్సెస్ ఫుల్ సినిమాల తర్వాత మైత్రీ మూవీ మేకర్స్, విజయ్ కలిసి చేస్తున్న మూడో చిత్రమిది. 'టాక్సీవాలా' లాంటి సూపర్ హిట్ తర్వాత విజయ్ దేవరకొండ, రాహుల్ సంకృత్యన్ ఈ సినిమాతో మరోసారి కలిసి పని చేస్తున్నారు.


Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.